


మరిన్ని కథనాల కోసం యూట్యూబ్‌లో ప్రసారమవుతున్న మీ SREECHAKRA NewsTVని వీక్షించండి. ప్లీజ్, సబ్స్క్రైబ్, లైక్.

https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY




సంపుటి 11 | సంచిక 92 | కర్నూలు | బుధవారం13-05-2026

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi

## ట్రాన్స్‌జెండర్ వెల్ఫేర్ బోర్డుకు కొత్త సభ్యులు

**విశాఖ తిరుపతి కలెక్టర్లకు బోర్డులో ప్రాతినిధ్యం**

**బోర్డులో కొత్తగా ముగ్గురు ట్రాన్స్‌జెండర్లకు చోటు**




అమరావతి,మే12(శ్రీచక్ర) ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ స్టేట్ వెల్ఫేర్ బోర్డుకు కొత్త సభ్యులను నియమిస్తూ చంద్రబాబు సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. ట్రాన్స్‌జెండర్ హక్కుల పరిరక్షణ చట్టం-2019 ప్రకారం ఈ నియామకాలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రాతినిధ్యం కల్పించేలా కలెక్టర్లను ప్రభుత్వం నామినేట్ చేసింది. విశాఖపట్నం కలెక్టర్‌ను ఆంధ్ర ప్రాంతానికి ప్రతినిధిగా నియమించగా, తిరుపతి కలెక్టర్‌ను రాయలసీమ ప్రాంతానికి ప్రతినిధిగా నియమించింది. ఈ నిర్ణయం ద్వారా ప్రాంతీయ స్థాయిలో ట్రాన్స్‌జెండర్ సమస్యలు, సంక్షేమ కార్యక్రమాల అమలు మరింత సమర్థవంతంగా జరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ స్టేట్ వెల్ఫేర్ బోర్డులో నామినేట్ సభ్యులుగా ముగ్గురు ట్రాన్స్‌జెండర్ ప్రతినిధులకు అవకాశం కల్పించింది. కోట ప్రేమ్ సాగర్ రాయ్, నక్క జీవన్ కువూరి, బోను దుర్గలను బోర్డు సభ్యులుగా నియమించింది. ఈ నియామకాల ద్వారా ట్రాన్స్‌జెండర్లకు సంబం ధించిన సమస్యలు నేరుగా ప్రభుత్వ దృష్టికి వెళ్లే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం, నియమిత సభ్యుల పదవీకాలం రెండేళ్ల పాటు ఉంటుంది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ నియామకాలు అమల్లో ఉంటాయని ఏపీ సర్కార్ స్పష్టం చేసింది. మహిళా, శిశు, దివ్యాంగ ులు, వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జీఓ ఎంఎస్ నంబర్1 4 విడుదల చేసింది. ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవ ంతంగా అమలు చేయడాని కి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్లకు విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక భద్రత వంటి అంశాల్లో మరింత సహకారం అందించే ందుకు చర్యలు చేపడుతోంది. ట్రాన్స్‌జెండర్ హక్కుల పరిరక్షణ చట్టం-2019 అమల్లో భాగంగా సంక్షేమ బోర్డు కీలక పాత్ర పోషించనుంది. సమాజంలో ట్రాన్స్‌జెండర్లకు సమాన హక్కులు, గౌరవం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. ట్రాన్స్‌జెండర్ వెల్ఫేర్ బోర్డుకు సభ్యులను నియమించడంపై ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారంశైలజ మీడియాతో మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులు, సంక్షేమంపై కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. ట్రాన్స్‌జెండర్ సమాజం ఎదుర్కొంట ున్న సమస్యలను మే 4వ తేదీన మంత్రి నారా లోకేశ్ దృష్టికి తాను తీసుకెళ్లానని ప్రస్తావించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ట్రాన్స్‌జె ండర్ల అభివృద్ధి, సంక్షేమా నికి ప్రభుత్వం కట్టుబడి పనిచేయడం కూటమి సర్కారు చిత్తశుద్ధికి నిదర్శనమని రాయపాటి శైలజ పేర్కొన్నారు.

## అసోం సిఎంగా హిమంత బిశ్వశర్మ

**ప్రమాణ కార్యక్రమానికి ప్రధాని హాజరు**

**ఎన్‌డి ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు రాక**



గౌహతి,మే12(శ్రీచక్ర) అస్సాం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వశర్మ ప్రమాణస్వీకారం చేశారు. అస్సాంలో వరుసగా రెండోసారి సీఎం పదవిని చేపట్టిన తొలి భాజపా నేతగా హిమంత నిలిచారు. ఆయనతో పాటు మరో నలుగురు మంత్రులు ప్రమాణం చేశారు. ఉదయం 11.40 గంటలకు గువాహటిలోని వెటర్నరీ కాలేజీ ఫీల్డ్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. బిశ్వ శర్మతో పాటు బీజేపీ నుంచి ఇద్దరు, ఏజీపీ, బీపీఎఫ్ నుంచి ఒక్కొక్కరు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అస్సాంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడం ఇది వరుసగా మూడోసారి కాగా, అసోం ముఖ్యమంత్రిగా శర్మ పగ్గాలు చేపట్టడం రెండోసారి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, పలువురు కేంద్ర మంత్రులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహా పలువురు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు హాజరయ్యారు.హిమంత బిశ్వ శర్మతో పాటు రామేశ్వర్ తేలి, అతుల్ బోరా, చరణ్ బోరో, అజంతా నియోగ్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, కొత్త టీమ్‌తో కలిసి పూర్తి అంకితభావంతో పటిష్టమైన, మరింత అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన అస్సాంను నిర్మిస్తామని శర్మ ప్రకటించారు. హిమంత బిశ్వ శర్మ తొలిసారి 2021లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. మొత్తం 126 స్థానాల్లో ఎన్డీయే 102 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 82 సీట్లు దక్కించుకోగా, భాగస్వామ్య పార్టీలైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు గెలుచుకున్నాయి. కాంగ్రెస్ సారథ్యంలోని కూటమికి 19 సీట్లు వచ్చాయి. భాజపా ఒక్కటే 82 సీట్లు గెలుచుకోగా.. దాని కూటమి భాగస్వాములైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు దక్కించుకున్నాయి. దీంతో ఎన్డీఏ రాష్ట్రంలో వరుసగా మూడోసారి తమ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ఈ కార్యక్రమానికి ముందు వేదిక వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తచ్చాడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. తనిఖీ చేయగా అతడి వద్ద తుటాలు లభ్యమయ్యాయి. వెంటనే అనుమానితుడిని బసిస్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టామన్నారు. హిమంత ప్రమాణస్వీకార కార్యక్రమానికి పీఎం మోదీ సహా పలువురు కీలక నేతలు హాజరైన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

## బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం

**మరింత బలపడే అవకాశం ఉందన్న వాతావరణశాఖ**

విశాఖపట్టణం,మే12(శ్రీచక్ర) బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోంది. రానున్న 48 గంటల్లో ఇది మరింత బలపడే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. కోస్తా జిల్లాల్లో వచ్చే ఐదు రోజుల పాటు వానలు పడే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. రాయలసీమ నుంచి తమిళనాడు, కర్ణాటక వరకు ద్రోణి విస్తరించి ఉందని అధికారులు చెప్పారు. మరోవైపు నైరుతి బంగాళాఖాతంలో



ఏర్పడిన అల్పపీడనం ఈరోజు ఉదయం 8:30 గంటల సమయానికి అదే ప్రాంతంలో కొనసాగుతోందని ఐఎండీ తెలిపింది. ఇది సముద్ర మట్టానికి సగటున 4.5 కిలోమీటర్ల ఎత్తు వరకూ విస్తరించి ఉందని వెల్లడించింది. ఇది రాబోయే 48 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. నైరుతి ప్రాంతం కాకుండా మిగిలిన బంగాళాఖాతం, అండమాన్ సముద్రంలో వాతావరణం సాధారణంగా ఉంటుందని చెప్పింది. ఈ వారం చివరి నాటికి దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్ అండ్ నికోబార్ దీవుల్లోని కొన్ని ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాల ప్రవేశానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని ఐఎండీ తెలిపింది. ఈ మేరకు ఓ ప్రకటన జారీ చేసింది.

## కొత్తగా 5 ఫైర్ స్టేషన్ల ఏర్పాటు

**దశలవారిగా 1275 ఖాళీల భర్తీ**

**పారిశ్రామిక ప్రాంతాల్లో ఇడస్ట్రీల భాగస్వామ్యం**

**అధికారులతో సమీక్షలో హోంమంత్రి అనిత**

అమరావతి,మే12(శ్రీచక్ర) : కొత్తగా ప్రతిపాదించిన 5 ఫైర్‌స్టేషన్ల ఏర్పాటును వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత సూచించారు. విశాఖపట్నం పశ్చిమ పారిశ్రామిక ప్రాంతాల్లో ఇండస్ట్రీల భాగస్వామ్యంతో ఫైర్‌స్టేషన్లను ప్రతిపాదించినట్లు తెలిపారు. అగ్నిమాపక శాఖలో 1,275 ఖాళీలను దశల వారీగా భర్తీ చేయాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ పనితీరుపై అనిత సచివాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫైర్‌స్టేషన్లు లేని 22 నియోజకవర్గాల పరిస్థితిపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడారు. జాబ్ క్యాలెండర్‌లో ఉన్న 305 పోస్టుల నియామక పక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఫైర్ సిబ్బంది స్పందన సమయాన్ని 30 నిమిషాల నుంచి 15 నిమిషాలకు తగ్గించాలని మార్గనిర్దేశం చేశారు. పరిశ్రమల సహకారంతో ఫైర్ అవుట్‌పోస్టుల ఏర్పాటును పరిశీలించాలని హోంమంత్రి అనిత సూచించారు. ఫైర్ టెండర్ల వినియోగంపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. సెజ్ ప్రాంతాల్లో సమష్టి స్టేషన్ల ఏర్పాటుపై దృష్టిసారించాలని పేర్కొన్నారు. పరిశ్రమల్లో ఫైర్‌సేఫ్టీ అధికారుల నియామకం తప్పనిసరిగా చేయాలని స్పష్టం చేశారు. లైసెన్స్ పొడిగింపులకు ÷ర్‌సేఫ్టీ సర్టిఫికెట్లు తప్పనిసరి చేయాలని సూచించారు. అడవిలో అగ్నిప్రమాదాల నియంత్రణలో డ్రోన్ల వినియోగంపై దృష్టిసా రించాలని ఆదేశించారు. వ్యర్థాలపై సరైన వర్గీకరణ లేకపోవడంతో అగ్నిప్రమాదాలు జరు గుతున్నా యని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు, ఆస్పత్రులు, అపార్ట్ మెంట్లలో ర్‌సేఫ్టీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని దిశానిర్దేశర చేశారు. 'ఆపద మిత్ర' తరహాలో యువతకు స్వచ్ఛంద సేవా శిక్షణను విస్తరించాలని సూచించారు. సింగపూర్, స్విట్జర్లాండ్ విపత్తు నిర్వహణ విధానాలపై అధ్యయనం చేయాలని మార్గనిర్దేశర చేశారు. ఛత్తీస్‌గఢ్, చండీగఢ్ నమూనాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని సూచించారు. అగ్నిమాపక అత్యవసర సేవలను 112 సేవలతో సమన్వయం చేయాలని హోంమంత్రి అనిత ఆదేశాలు జారీ చేశారు.

## ప్రతిభ చాటుతున్న బీసీ సంక్షేమ స్కూళ్ల విద్యార్థులు

**టెన్త్‌లో ర్యాంకులు సాధించిన వారికి మంత్రి అభినందనలు**

**400 మంది విద్యార్థులకు పురస్కారాలు, మెమొంటోలు**

విజయవాడ,మే12(శ్రీచక్ర) : టెన్త్ క్లాస్‌లో మంచి మార్కులు సాధించిన గురుకుల విద్యార్థులను మంత్రి సవిత సత్కరించారు. దాదాపు 400 మంది విద్యార్థులకు పురస్కారాలు, మెమోంటోలను అందజేశారు. టెన్త్ క్లాస్‌లో ఎంజేపీ గురుకుల పాఠశాల విద్యార్థిని, నంద్యాలకు చెందిన సాయి శ్రీ 596 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం అంతా బీసీ సంక్షేమ స్కూల్స్‌వైపే చూడ్డానికి కారణం ప్రిన్సిపాల్స్, సెక్రటరీస్, డైరెక్టర్లు అని అన్నారు. బీసీ సంక్షేమ స్కూళ్లలో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులు నిరూపించారన్నారు. వేదిక మీద చాలామంది గవర్నమెంట్ స్కూళ్లలో చదువుకున్నవారే ఉన్నారన్నారు. 'తల్లిదండ్రులు మమ్మల్ని నమ్మి.. మీ బిడ్డలను బీసీ సంక్షేమ స్కూల్స్‌కు పంపించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు' అని మంత్రి అన్నారు. తల్లిదండ్రులు కోరుకున్న విధంగానే విద్యార్థులకు మంచి మార్కులు వచ్చాయని తెలిపారు. రోజుకి 20 గంటలు పేద ప్రజల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని మంత్రి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ సంక్షేమ స్కూల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. అధికారంలోకి రాగానే డైట్ బిల్లు రూ.110 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మస్కిటో మెష్, ఇన్వెటర్స్, ఆర్వో ఎ÷-లాంట్స్, సన్న బియ్యం, 100 డేస్ యాక్షన్ ఎ÷-లాన్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇంట్లో ఎంతమంది బిడ్డలు ఉంటే అంతమందికి 'తల్లికి వందనం' అందిస్తున్నామన్నారు. విద్యతో పాటు స్పోర్ట్స్ డెవలప్ చేసే దిశగా కృషి చేస్తున్నామని మంత్రి చెప్పారు. గురుకులాల్లో ప్రస్తుతం స్కూల్స్ మాత్రమే ఉన్నాయని.. 6 కాలేజీల ఏర్పాటుకు అనుమతి వచ్చిందని మంత్రి అన్నారు. బీసీ సంక్షేమ స్కూళ్లలో చదివే విద్యార్థులకు ఇంటర్నేషనల్ అవార్డ్స్ కూడా వచ్చాయన్నారు. బీసీ సంక్షేమ స్కూళ్లలో ఒక హాస్టల్ విద్యార్థికి 75 వేల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేస్తోందని మంత్రి సవిత పేర్కొన్నారు.



## జగన్‌వి నీతి మాలిన రాజకీయాలు

**అభివృద్ధి అంటే గిట్టని వైసిపి నేత**

**అమరావతిని చూసి ఓర్వలేక మావిగన్ జపం**

**జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి కొల్లు రవీంద్ర**



మచిలీపట్నం,మే12 (శ్రీచక్ర) : మూడు రాజధానుల వ్యవహారం ముగిసినా..ఇప్పుడు మావిగన్ పేరుతో జగన్ విన్యాసాలు చేస్తున్నారని, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే చూసి ఓర్వలేక జగన్ రెడ్డి విషం చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు. మంగళవారం మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డి లాంటి దుర్మార్గుడి చూపు రాష్ట్రంపై పడకూడదని నాడు ఆయన తండ్రే తరిమేశారని ఆరోపించారు. ప్రజావేదిక కూల్చివేతతో జగన్ రెడ్డి రాష్ట్రంపై తన దుర్మార్గాలకు శ్రీకారం చుట్టారని దుయ్యబట్టారు. మూడు రాజధానుల పేరుతో అధికారంలో ఉన్న ఐదేళ్లు అరాచకం సృష్టించారని మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహించారు. భూములిచ్చిన రైతన్నలను పోలీసుల లాఠీలతో కొట్టించి, బూటు కాళ్లతో తన్నించారని విమర్శించారు. పేదల బియ్యాన్ని పందికొక్కులా బొక్కేసినోళ్లు కూడా నీతులు మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. జగన్ తన తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని క్విడ్ ప్రో కో ద్వారా ప్రజల ఆస్తులను దోచారని మండిపడ్డారు. ఐదేళ్లు అడ్డగోలుగా దోచుకుని అమరావతి నిర్మాణంపై నిందలేయడం సిగ్గుచేటని అన్నారు. మావిగన్ అంటూ ఇప్పుడు మాట్లాడే వైసీపీ నేతలు.. గత ఐదేళ్లు ఏం చేశారు..? అని ప్రశ్నించారు. జగన్ రెడ్డికి భజన చేయడం తప్ప వైసీపీ నేతలు సొంత బుర్రలు వాడటం మానేశారని సెటైర్లు గుప్పించారు.అమరావతే రాజధాని అని ఒకసారి.. మూడు రాజధానులని మరోసారి.. ఇప్పుడు మావిగన్ అంటూ నీతి లేని వ్యాఖ్యలు చేస్తున్నారని కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. కృష్ణా గుంటూరు జిల్లాల్లోని వైసీపీ నేతలు జగన్ రెడ్డికి భజన చేయడం తప్ప రాష్ట్రాభివృద్ధి పట్టదా..? అని నిలదీశారు. మూడు ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. రాయలసీమకు గతంలో కియా, ఇప్పుడు డ్రోన్స్, డిఫెన్స్, రాయల్ ఎన్ ఫీల్డ్ తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఉత్తరాంధ్రలో భోగాపురం, గూగుల్ డేటా సెంటర్, అర్సెలార్ మిట్టల్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పుడు నీతులు మాట్లాడుతున్న బియ్యం దొంగ ఐదేళ్లలో బందరు పోర్టు ఎందుకు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పేర్ని నాని తన స్థాయి మరిచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురించి మాట్లాడుతున్నారని కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సంపాదకీయం

## బంగారం కొనొద్దని ప్రధాని మోదీ ఎందుకు...

దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది.. మనం దేశభక్తిని నిరూపించుకోవాల్సిన సమయం వచ్చింది.. అయితే అందుకోసం పెద్దపెద్ద త్యాగాలు చేయాల్సిన పని లేదు.. కానీ మన రోజువారీ పనుల్లో కొన్ని మార్పులు చేసుకుంటే సరిపోతుందని సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన బిజెపి బహిరంగ సభలో ప్రధాని మోదీ అన్నారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా మళ్లీ కోవిడ్ కాలం నాటి పని సంస్కృతిని ప్రజలందరూ అలవాటు చేసుకోవాలని సూచించారు.భారతదేశంలో బంగారం కేవలం ఒక లోహం మాత్రమే కాదు.. దీనిని సంప్రదాయానికి, సంపదకు, సామాజిక హోదాకు చిహ్నంగా భావిస్తారు. ముఖ్యంగా వివాహాలు, దీపావళి, అక్షయ తృతీయ వంటి పండుగల సమయాల్లో బంగారం కొనుగోళ్లు గరిష్ట స్థాయికి చేరుకుంటాయి. కొన్ని గణాంకాల ప్రకారం.. భారతీయులు ఏటా సగటున 700 నుండి 800 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేస్తున్నారని తెలుపుతున్నాయి. ప్రపంచంలోనే అత్యధికంగా బంగారాన్ని వినియోగించే దేశాల్లో భారత్ ఒకటిగా నిలవడానికి ఇక్కడి ప్రజలకు ఈ పసిడిపై ఉన్న మక్కువనే ప్రధాన కారణం. అయితే ఇటీవల మోదీ బంగారం ఎక్కువగా కొనుగోలు చేయొద్దని ప్రకటన చేశారు. అలా ఎందుకు చేయాల్సి వచ్చిందిదేశంలో బంగారానికి భారీ డిమాండ్ ఉంది. కానీ ఇందుకు విరుద్ధంగా మన దేశీయ ఉత్పత్తి అత్యంత స్వల్పంగా ఉంది. ఏటా కేవలం 1 నుండి 2 టన్నుల బంగారం మాత్రమే మన గనుల నుండి లభిస్తోంది. దీనివల్ల దాదాపు 90 శాతం కంటే ఎక్కువ డిమాండ్‌ను విదేశీ దిగుమతుల ద్వారానే తీర్చుకోవాల్సి వస్తోంది. ముడిచమురు తర్వాత భారత్ అత్యధికంగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చు చేస్తున్నది బంగారం దిగుమతుల కోసమే. దీనివల్ల దేశ కరెంట్ అకౌంట్ లోటు పెరిగి, రూపాయి విలువపై, విదేశీ మారక నిల్వలపై తీవ్ర ఒత్తిడి పడుతోంది.ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బంగారం కొనుగోళ్లను తగ్గించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల తెలంగాణలో పర్యటించినప్పుడు తెలిపారు. కనీసం ఏడాది పాటు కొత్త బంగారం కొనకుండా ఉండటం వల్ల దేశం నుంచి బయటకు వెళ్లే విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయవచ్చని, ఆ నిధులను దేశాభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ఉపయోగించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. పసిడిపై పెట్టుబడి పెట్టడం వల్ల అది వ్యక్తిగతంగా లాభదాయకంగా అనిపించినప్పటికీ, దేశ ఆర్థిక వ్యవస్థ పరంగా అది 'డెడ్ ఇన్వెస్ట్‌మెంట్' గానే మిగిలిపోతుందనేది నిపుణుల వాదన.బంగారం కొనుగోళ్లను తగ్గించడానికి ప్రభుత్వం 'సావరిన్ గోల్డ్ బాండ్' పథకాన్ని ప్రవేశపెట్టింది. భౌతికంగా బంగారాన్ని కొని లాకర్లలో దాచుకోవడం కంటే, బాండ్ల రూపంలో పెట్టుబడి పెట్టడం వల్ల విదేశీ దిగుమతుల భారం తగ్గుతుంది. దీనివల్ల వినియోగదారులకు భద్రతతో పాటు అదనపు వడ్డీ కూడా లభిస్తుంది. ప్రజలు తమ పెట్టుబడి దృక్పథాన్ని మార్చుకుని, భౌతిక బంగారం నుంచి డిజిటల్ , బాండ్ల వైపు మళ్ళినప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది అని ఆర్థిక నిపుణులు అంటున్నరు.స్టాక్ మార్కెట్‌లో బ్లడ్ బాత్ చూడగానే అర్థమైంది అందరికి. మోదీ ఇచ్చింది స్టేట్‌మెంట్ కాదు అదొక వార్నింగ్ సిగ్నల్ అని. పొలిటికల్‌గా, ఒక పొలిటీషియన్‌గా నరేంద్ర మోదీ ఎంత అగ్రెసివ్‌గానైనా మాట్లాడొచ్చు. కాని, దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన మ్యాటర్ అయితే మాత్రం.. ప్రతి అక్షరాన్ని, ప్రతి పొల్లును కొలతకొలిచినట్టు మరీ మాట్లాడతారు. అంతా సుభిక్షం, అంతా ప్రశాంతం అనాల్సిన మూవెంట్‌లో... 'జాగ్రత్తగా ఉండండి' అని అన్నారంటే, కచ్చితంగా 'దేశం క్లిష్ట పరిస్థితి'లో ఉందనే అర్థం. భయపెట్టాలని కాదు గానీ.. దేశ ప్రజలను ముందస్తుగా ప్రిపేర్ చేస్తున్నట్టు కనిపిస్తోంది ఆ మాటల్లో. సేవింగ్స్ మొత్తం ఖర్చైపోవచ్చు. ఏదైనా జరగొచ్చు. మోదీ మాటలను డీకోడ్ చేస్తే వచ్చే అర్థం ఇదే. భారతదేశం ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బంగారు వినియోగదారు. ఏటా సగటున 700 నుండి 900 టన్నుల బంగారాన్ని మనం దిగుమతి చేసుకుంటున్నాం. ఇక్కడే అసలు సమస్య మొదలవుతోంది. మనం దిగుమతి చేసుకునే ప్రతి గ్రాము బంగారానికి అమెరికన్ డాలర్లలో చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా ఏటా 35-45 బిలియన్ డాలర్లు బంగారం దిగుమతులకే ఖర్చవుతాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర ట్రాయ్ ఔన్సుకు 3,000 డాలర్లు దాటడంతో ఈ బిల్లు తడిసి మోపెడవుతోంది.ఒకవైపు పసిడి ధరలు భగ్గుమంటుంటే, మరోవైపు మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాల వల్ల ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 126 డాలర్లకు చేరుకున్నాయి. దేశం నడవాలంటే చమురు తప్పనిసరి. మనం మన అవసరాల్లో 85శాతం దిగుమతి చేసుకుంటున్నాం. చమురుతో పోలిస్తే బంగారం కొనుగోలు అనేది ఒక ఆప్షన్ మాత్రమే..ముఖ్యంగా పెళ్లిళ్ల కోసం కొనే బంగారాన్ని వాయిదా వేయడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు భారీ ఊరట లభిస్తుంది.దేశం యొక్క ఆర్థిక స్కోర్‌కార్డ్‌నే కరెంట్ ఖాతా అంటారు. మనం ఎగుమతుల ద్వారా సంపాదించే దానికంటే, దిగుమతుల కోసం ఖర్చు చేసేది ఎక్కువైతే లోటు ఏర్పడుతుంది. ఈ లోటు పెరిగితే రూపాయి విలువ పడిపోయి, ఆర్థిక వ్యవస్థ అస్థిరంగా మారుతుంది.భారతదేశంలో ఏటా సుమారు 10-12 మిలియన్ల వివాహాలు జరుగుతాయి. అక్టోబర్ నుండి ఫిబ్రవరి వరకు ఉండే పెళ్లిళ్ల సీజన్‌లోనే దేశంలో అత్యధికంగా బంగారం అమ్ముడవుతుంది. "ఇది నిషేధం కాదు, కేవలం ఒక నైతిక విజ్ఞప్తి మాత్రమే. దేశం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు పౌరులు స్వచ్ఛందంగా తమ కొనుగోళ్లను వాయిదా వేసుకుంటే, అది దేశ విదేశీ మారక నిల్వలను కాపాడుతుంది" అని ఆర్థిక విశ్లేషకుల అభిప్రాయపడుతున్నారు.క్లుప్తంగా చెప్పాలంటే, మళ్లీ లాక్‌డౌన్ పరిస్థితులు రాకుండా ఉండాలన్నా, రాబోయే ప్రపంచ ఆర్థిక సంక్షోభ పరిస్థితుల నుండి సామాన్యులను, దేశ ఆర్థిక వ్యవస్థను రక్షించడానికి, ప్రజల్లో క్రమశిక్షణ, పొదుపు అనే ముందస్తు జాగ్రత్తలను అలవాటు చేసేందుకుకే ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్టు తెలుస్తోంది

# విమానాశ్రయంలా నంద్యాల రైల్వే స్టేషన్ అభివృద్ధి

**రైలు ప్రయాణికులకు ఆధునిక వసతి, తక్కువ చార్జీ, సురక్షిత ప్రయాణం లక్ష్యం**
**అట్టహాసంగా గుంతకల్లు - మార్కాపురం పగటిపూట ప్యాసింజర్ రైలును ప్రారంభించిన నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**





నంద్యాల, మే 12 (శ్రీచక్ర): విమానాశ్రయంలా నంద్యాల రైల్వే స్టేషన్ అభివృద్ధి చేశామని, మరింత ఆధునికరించి రైలు ప్రయాణికులకు ఆధునిక వసతి, తక్కువ చార్జీ, సురక్షిత ప్రయాణం లక్ష్యంగా పనిచేస్తున్నామని, నంద్యాల జిల్లా రైలు ప్రయాణికుల చిరకాలిక స్వప్నం నంద్యాల నుంచి గుంతకల్లుకు పగటిపూట రైలును నేడు ప్రారంభించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. మంగళవారం నంద్యాల రైల్వే స్టేషన్ లో దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డి ఆర్ ఎం సుధేష్టసేన్ తో కలిసి నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి గుంతకల్లు వయా నంద్యాల మీదుగా మార్కాపురం రోడ్డు వరకు నూతన ప్యాసింజర్ రైలును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ లో రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన నూతన రైలు ప్రారంభ సభలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ నంద్యాల జిల్లా ప్రజలు అమ్మా నంద్యాల నుంచి గుంతకల్లు వైపు పగటిపూట ఒక్క రైలు లేదు, అన్ని రైళ్లు అర్ధరాత్రి ఉన్నాయి ఎలాగైన్ పగటి పూట ప్యాసింజర్ రైలు నడిచేలా చూడాలని వినతి పత్రాలు ఇచ్చారని, ప్రజల వినతిని తాను పార్లమెంట్ లో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీవైష్టవ్ దృష్టికి తీసుకెళ్లగా ఒక్క క్షణం ఆలోచించ కుండా మీ విన్నపంను త్వరలో కార్యరూపం ధాలుస్తానని, వెంటనే రైల్వే అధికారులకు ఆదేశాలు ఇవ్వడం, దక్షిణ మధ్య రైల్వే శాఖ ఉన్నతాధికారులు కూడా వెంటనే స్పందించి నేడు నూతన రైలును ప్రారంభించుకుంటున్నామని, నంద్యాల జిల్లా ప్రజల తరుపున కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీవైష్ణవ్ కు, దక్షిణ మధ్య రైల్వే శాఖ ఉన్నతాధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదములు తెలుపుతున్నామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. నంద్యాల మీదుగా అజ్మీర్, శబరి మల, కడప ఇస్తేమాలకు ప్రత్యేక రైళ్లు వేయించామని, రైలు ప్రయాణికుల కోరిక మేరకు నంద్యాల మీదుగా మరి కొన్ని రెగ్యులర్ రైళ్లు నడిసేలా చూస్తామని, నంద్యాల, బనగానపల్లె, కోవెలకుంట్ల, బేతంచెర్ల, డోన్ రైల్వే స్టేషన్లలో ఇంకా అనేక సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి నూనెపల్లి రోడ్డు అండర్ బ్రిడ్జి నిర్మాణం భూసేకరణ సమస్య వివరించగా తప్పకుండా చేద్దాం అన్నారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఇప్పటికే రూ. 24 కోట్లతో నంద్యాల రైల్వే స్టేషన్ ఆధునికరణ పనులు జరుగుతున్నాయని, నంద్యాలకు రైల్వే గూడ్స్ స్టేషన్ కొత్తగా మంజూరు అయిందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రకటించారు. నంద్యాలకు ఫిట్ లైన్ మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వంను కోరామని, దశలవారీగా అన్ని రైల్వే సమస్యలు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మీ అందరి సహకారంతో సాధించుకుంటాం అన్న నమ్మకం ఉందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు, రైల్వే శాఖకు వారధిగా ఉంటున్న నంద్యాల, మార్కాపురం జిల్లాల రైల్వే డివిజనల్, జోనల్ జడ్ ఆర్ సి సి సభ్యులు నారాయణ రెడ్డి, వెంకట రంగయ్య, జిన్ను ప్రసాద్ రెడ్డి, నాగేశ్వరావు, అమీర్ బాషా, జుబేర్ బాషా లను డి ఆర్ ఎం, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డి సి ఎం డాక్టర్. ప్రదీప్, సీనియర్ డి పి ఓ క్యాప్టర్ ఆరోరా తదితరులు పాల్గొన్నారు.

# "జలధారతో జల సంరక్షణ.. తవిసికొండలో పచ్చదన విప్లవం"

**ఎండిన కొండలకు జీవం పోసిన కందకాల పనులు**
**వర్షపు నీటి ప్రతి చుక్కను భూమిలో నిల్వ చేసే ప్రయత్నం ఫలిస్తోంది**
**బోర్లలో పెరిగిన నీటి మట్టం.. రైతుల్లో కొత్త ఆశలు**
**జలహారతి పనులతో మారుమూల గ్రామంలో మారుతున్న జీవన చిత్రం**







నంద్యాల, మే 12 (శ్రీచక్ర): నంద్యాల జిల్లా బేతంచెర్ల మండల కేంద్రానికి సుమారు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న తవిసికొండ? పేరు చెప్పగానే ఎండిన కొండలు, గులకరాళ్లతో నిండిన పొలాలు, నీటి కోసం నిత్య పోరాటం గుర్తుకు వచ్చేవి. వర్షం పడితేనే పంట? లేకపోతే నిరాశే అన్న పరిస్థితి అక్కడి రైతులది. గ్రామంలో దాదాపు 150 కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ, త్రాగునీటి కోసం కేవలం రెండు బోర్లపైనే ఆధారపడాల్సిన దుస్థితి. కొత్తగా బోరు వేయాలంటే 600 నుంచి 700 అడుగుల లోతు వరకు తవ్వాల్సి వచ్చేది. చుట్టూ బోడిగుట్టలు, తక్కువ భూగర్భ జలాలు? ఇదే తవిసికొండ గతం. అలాంటి గ్రామంలో ఇప్పుడు పచ్చదనం కనిపిస్తోంది. కొండలపై చెట్లు పెరుగుతున్నాయి. బోర్లలో నీటి మట్టం నిలకడగా ఉంది. రైతుల్లో ఆశ పెరుగుతోంది. దీనికి కారణం "జలధార - జలహారతి" కార్యక్రమం కింద చేపట్టిన కందకాల పనులు. గ్రామ పరిసర కొండ ప్రాంతాల్లో గత కొన్ని సంవత్సరాలుగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ట్రెంచ్‌లు (కందకాలు) తవ్వే పనులు చేపట్టారు. ఈ కందకాల వల్ల వర్షపు నీరు కొండలపై నుంచి వృథాగా పారిపోకుండా భూమిలోకి ఇంకిపోతోంది. ఫలితంగా గతంలో బోడిగా కనిపించిన కొండలు ఇప్పుడు పచ్చదనంతో కళకళలాడుతూ గ్రామస్థుల్లో కొత్త ఆశలను నింపుతున్నాయి. ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా అమలు చేయాలనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి ప్రత్యేక చొరవ తీసుకొని రూ.4.95 లక్షలు మంజూరు చేశారు. ప్రస్తుతం బూర్గుల చేనుకొండ ప్రాంతంలో గత మూడు వారాలుగా సుమారు 50 మంది శ్రామికులు కందకాల పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఉపాధితో పాటు ప్రకృతి సంరక్షణ కలిసొస్తుండటంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పెద్దలు చెబుతున్న మాటల్లోనే ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. "మునుపు వర్షం పడితే నీళ్లు ఒక్కసారిగా పారిపోయేవి. ఇప్పుడు కందకాల వల్ల నీరు భూమిలోనే ఇంకిపోతోంది. గతంలో తవ్విన ట్రెంచ్‌ల ప్రభావంతో మా గ్రామంలోనే కాదు, చుట్టుపక్కల బోర్లలో కూడా నీరు తగ్గలేదు. పండ్ల తోటలు కూడా పెరుగుతున్నాయి" అని వారు సంతోషంగా చెబుతున్నారు. తవిసికొండకు మజర గ్రామమైన హుసేనాపురంలో ఈ మార్పు మరింత స్పష్టంగా కనిపిస్తోంది. తక్కువ ఎత్తులో ఉండటంతో అక్కడ నీటి లభ్యత పెరిగి, రైతులు విస్తృతంగా పండ్ల తోటలు పెంచుతున్నారు. ఇది జల సంరక్షణ చర్యల ఫలితమేనని అధికారులు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి మాట్లాడుతూ, ''వర్షపు నీటిని ప్రతి చుక్కను భూమిలోనే నిల్వ చేయగలిగితేనే భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించగలం. జలధార - జలహారతి కార్యక్రమం కేవలం పనుల పరిమితి కాదు? ఇది గ్రామాల భవిష్యత్తును మార్చే ఉద్యమం. తవిసికొండలాంటి మారుమూల గ్రామాల్లో కనిపిస్తున్న మార్పు ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా నిలుస్తుంది" అని తెలిపారు. ''ప్రకృతిని కాపాడితే ప్రకృతి మనలను కాపాడుతుంది. ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న ఈ పనులు గ్రామాలకు నీటి భద్రతను తీసుకురావడంతో పాటు పచ్చదనాన్ని పెంచుతున్నాయి. ప్రజలు కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి" అని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఒకప్పుడు నీటి కోసం ఎదురుచూసిన తవిసికొండ? ఇప్పుడు వర్షపు నీటిని ఒడిసిపట్టుకుని పచ్చదనపు బాటలో ముందుకు సాగుతోంది. కొండల్లో తవ్విన చిన్న చిన్న కందకాలు గ్రామ భవిష్యత్తును మార్చగలవని ఈ విజయగాథ స్పష్టంగా నిరూపిస్తోంది.

# హరిత మంత్రాలయంగా తీర్చిదిద్దుతాం..

**-పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థులు**
**-ముందుకు వచ్చిన దాత పీవీ బద్రినాథ్ రావు**
**-రూ. 15 లక్షలతో పనులకు శ్రీకారం చుట్టిన పీఠాధిపతి**





మంత్రాలయం,మే 12,(శ్రీచక్ర) : దక్షిణ భారత దేశంలో రెండవ తిరుపతి గా పేరు గాంచిన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి వెలసిన మంత్రాలయంను హరిత మంత్రాలయంగా తీర్చిదిద్దుతామని మఠం పీఠాధిపతులు శ్రీ సుబుధేంద్ర తీర్థులు అన్నారు. మంగళవారం పాణ్యం కు చెందిన ఉజ్వల వేద బృందావన్ అధినేత పీవీ బద్రినాథ్ రావు అనే దాత రూ. 15 లక్షల ఖర్చుతో స్థానిక డీవీజీ అతిథి గృహం వద్ద హైవై రోడ్డు లో డివైడర్ మధ్యలో ఉన్న మొక్కలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసే పనులకు పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థులు శ్రీ కారం చుట్టారు. మంత్రాలయం పట్టణంతో పాటు, శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం అతిథి గృహాలు, తులసి వనం, గోశాల, బృందావనం గార్డెన్, సుశమీంద్రతీర్థుల పార్క్, గురు నివాస్, ప్రధాన రహదారుల్లో మొక్కలు నాటడం, వాటిని సంరక్షణించడం, పెంచే బాధ్యత పీవీ బద్రినాథ్ రావు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థులకు ఉజ్వల వేద బృందావన్ సంస్థ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ట్యాంకర్లకు పూజలు చేసి మొక్కలకు నీటిని సరఫరా చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థులు మాట్లాడుతూ... దర్శనం కోసం వచ్చే భక్తులకు, గ్రామస్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం, సుందర, స్వచ్ఛ, హరిత మంత్రాలయంగా తీర్చిదిద్దుతామని అన్నారు. మూడు నెలల్లో మంత్రాలయం పచ్చదనం సంతరించుకుంటుందని అన్నారు. లక్షల్లో ఖర్చు చేసేందుకు ఉజ్వల వేద బృందావన్ అధినేత పీవీ బద్రినాథ్ రావు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని, అనేక అభివృద్ధి పనులకు దాతలు ముందుకు వస్తున్నారని తెలిపారు. దాత బద్రినాథ్ రావు కు శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వాదించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి నారాయణ ఆచార్, ప్రసన్న ఆచార్,ఏఏవో మాధవ శెట్టి, మేనేజర్లు ఎస్ కే శ్రీనివాస్ రావు, సురేష్ కోణాపూర్, వెంకటేష్ జోషి, సుకుమార్, అబోడే త్రీస్టార్ హోటల్ మేనేజర్ రజనీకాంత్, కెనరా బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున, అసిస్టెంట్ మేనేజర్ నాగరాజు, ట్రాన్స్ కో ఏఈ గోవిందు, ఎంఈవో రాఘన్న, శ్రీనివాసులు, అలీ, రాజు, హజ్మత్ వలి, ద్వారపాలక అనంత స్వామి, ప్రకాష్ ఆచార్, నీలకంఠ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి :సమాచార శాఖ డైరెక్టర్ విశ్వనాథన్ ను కలిసిన ఏపీజేఎఫ్ నేతలు



విజయవాడ, మే 12 (శ్రీచక్ర): విజయవాడలోని సమాచార శాఖ రాష్ట్ర డైటెక్టర్ విశ్వనాథన్ ను మంగళవారం నాడు ఆంధ్ర ప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరమ్ (ఏపీజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు శివ రాజేష్, కర్నూలు జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ మెంబర్ హరినాథ రెడ్డి, ఏపీజేఎఫ్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, నాయకులు శ్రీనివాసులు, రఘురాం, భూపాల్ లు కలసి జర్నలిస్టుల సమస్యలపై చర్చించడం జరిగింది. త్వరలోరాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ జర్నలిస్టులను ఎంపిక చేసి అవార్డుల ప్రదానం చేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు డైరెక్టర్ విశ్వనాథం తెలిపారు. అదేవిధంగా జర్నలిస్టులపై జరిగే దాడులను నివారించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా నివారించేం దుకు అటాక్ కమిటీ ఏర్పాటు చేయాలి కోరగా సానుకూలం గా స్పందించి త్వరలో కమిటీ వేసేందుకు జీ ఓను విడుదల చేసి జిల్లాల వారీగా కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు.

శ్రీచక్ర
బుధవారం 13-05-2026

# నదుల స్వచ్ఛతకు ప్రజల సహకారం అవసరం

**కే.సి. కెనాల్, హంద్రీ నది ప్రాంతాల్లో కమిషనర్ పరిశీలన**
**నదుల ఇరువైపులా వెంటనే శుభ్రత పనులకు ఆదేశాలు**
**కొండారెడ్డి బురుజు అన్న క్యాంటీన్ నిర్వాహకులపై ఆగ్రహం**





కర్నూలు, మే 12 (శ్రీచక్ర): నగరంలో నదుల స్వచ్ఛత పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన కే.సి. కెనాల్, హంద్రీ నది ప్రాంతాల్లో ముమ్మరంగా పరిశీలించారు. నదుల పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతపై స్థానిక ప్రజలకు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే నదులు ఇరువైపులా వెంటనే శుభ్రత పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం కొండారెడ్డి బురుజు సమీపంలోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్ నిర్వహణలో లోపాలు గుర్తించిన ఆయన నిర్వాహకులు అందుబాటులో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 8 మంది సిబ్బంది ఉండాల్సిన చోట కేవలం నలుగురు మాత్రమే విధుల్లో ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. సూపర్వైజర్‌ను మార్చాలని సిటి సూపర్వైజర్‌కు ఆదేశించారు. అదే విధంగా రైతు బజార్ వద్ద పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, శానిటేషన్ ఇంస్పెక్టర్లు జిలాని, రమేష్, నాగేశ్వరరావు, అనిల్, మునిస్వామి, కుర్మయ్య, తదితరులు, పాల్గొన్నారు.

# పచ్చని కర్నూలు లక్ష్యంగా 45 లక్షల మొక్కలను నాటే విధంగా చర్యలు చేపడుతున్నాం

**ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి భవిష్యత్ తరాలకు పర్యావరణాన్ని బహుమతిగా అందిద్దాం:జిల్లా కలెక్టర్ డా.ఏ. సిరి**

కర్నూలు, మే 12 (శ్రీచక్ర): పచ్చని కర్నూలు లక్ష్యంగా జిల్లాలో 45 లక్షల మొక్కలను నాటే విధంగా చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. మంగళవారం ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ గ్రామంలోని కాల్వబుగ్గ నర్సరీని సందర్శించి, మొక్కల పెంపకాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం పచ్చదనం 36 శాతం ఉండాల్సి ఉండగా, కేవలం 6 శాతం మాత్రమే ఉందన్నారు. అందుకే ఈ ఏడాది 45 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో పచ్చదనం పెంపొందించేందుకు అన్ని శాఖలను సమన్వయం చేస్తూ కార్యాచరణ రూపొందించామన్నారు. డ్వామా ఆధ్వర్యంలో 10 లక్షల మొక్కలు, అటవీ శాఖ ఆధ్వర్యంలో 10 లక్షల మొక్కలు, మిగిలిన 25 లక్షల మొక్కలను వివిధ సంస్థలు, విద్యా సంస్థలు మరియు ఇతర విభాగాల సహకారంతో నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. డ్వామా వారు మొక్కల పెంపకానికి సంబంధించి ఇప్పటికే 3 ప్రధాన నర్సరీలలో భారీ స్థాయిలో మొక్కల పెంపకం చేపట్టారన్నారు..ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ నర్సరీలో 3 లక్షల మొక్కల పెంపకం జరుగుతుండగా, ఆలూరు ప్రాంతంలో సుమారు 3.5 లక్షల మొక్కలు, బనవాసి ప్రాంతంలో 3 లక్షలకు పైగా మొక్కల పెంపకం కొనసాగుతోందన్నారు. అదే విధంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో కూడా 10 లక్షలకు పైగా మొక్కలను సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా సీతాఫలం, టేకు, నేరేడు, ఉసిరి, చింత, కానుగ, వేప వంటి పర్యావరణానికి ఉపయోగకరమైన మొక్కల విత్తనాలను పెంచుతున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ఖాళీ ప్రదేశాలను గుర్తించి మొక్కల నాటకానికి అనువుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ముఖ్యంగా విద్యాశాఖ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామీణ ప్రాంతాలు, కాలనీలు, రహదారుల పరిసర ప్రాంతాల్లో మొక్కల నాటకం చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు కూడా మొక్కలను అందజేసి ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను పెంచేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. మున్సిపల్ పరిధిలో ప్రతి దుకాణానికి ఒక మొక్క అందజేసి వాటిని సంరక్షించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, నేషనల్ హైవే రోడ్ల వెంట కూడా పెద్ద ఎత్తున మొక్కలు నాటేలా చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో 45 లక్షల మొక్కలను నాటి వాటిని సమర్థవంతంగా సంరక్షించగలిగితే కనీసం ఒక శాతం పచ్చదనం పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు. మొక్కలను నాటడం మాత్రమే కాకుండా వాటిని కాపాడి పెంచడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. రానున్న జూన్ నెలలో వర్షాలు పడే అవకాశం ఉన్నందున అదే సరైన సమయంగా భావించి విస్తృత స్థాయిలో మొక్కల నాటడం చేపట్టాలన్నారు. నేటి తరానికి పర్యావరణాన్ని బహుమతిగా అందించే బాధ్యత మనందరిపైనా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి కర్నూలు ఆర్డీఓ అనురాధ, డ్వామా ప్రాజక్టు డైరెక్టర్ నరసింహ రెడ్డి, ప్లాంటేషన్ మేనేజర్ నందకిషోర్, తదితరులు పాల్గొన్నారు.



# డిజిటల్ డోర్ నెంబర్లతో విప్లవాత్మక మార్పు :నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు





కర్నూలు, మే 12 (శ్రీచక్ర): రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన క్యూఆర్ కోడ్ ఆధారిత డిజిటల్ డోర్ నంబర్ల ద్వారా పౌర సేవల్లో విప్లవాత్మక మార్పు వస్తుందని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నోడల్ ఆఫీసర్లు, మాస్టర్ ట్రైనర్లు, అడ్మిన్, ప్లానింగ్, అమినిటీస్ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. డిజిటల్ డోర్ నంబర్ల ద్వారా ప్రతి ఇంటికి ప్రత్యేక క్యూఆర్ కోడ్ అనుసంధానమవుతుందని, దీని ద్వారా ఆస్తి వివరాలు, పన్ను చెల్లింపులు, నీటి సరఫరా, ట్రేడ్ లైసెన్స్, పౌర సేవలకు సంబంధించిన అన్ని వివరాలు ఒకే వ్యవస్థలో అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. ఈ వ్యవస్థ ద్వారా పౌర సేవలు మరింత వేగవంతంగా, పారదర్శకంగా ప్రజల ముంగిటికే చేరుతాయని ఆయన పేర్కొన్నారు. దీని కోసం నియమించిన నోడల్ ఆఫీసర్లు, మాస్టర్ ట్రైనర్లు సమర్థవంతంగా పనిచేసి,అడ్మిన్,ప్లానింగ్,అమినిటీస్‌కార్యదర్శులతో సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇంచార్జీ సిటి ప్లానర్ వై.వి. వెంకటరమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, తదితరులు పాల్గొన్నారు.

# ఓర్వకల్లో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు స్థల సేకరణ

**ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్**

కర్నూలు, మే, 12 (శ్రీచక్ర): పాణ్యం నియోజకవర్గం పరిధిలోని ఓర్వకల్ మండల కేంద్రంలో ప్రతిపాదిత అగ్నిమాపక కేంద్ర స్థలాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మంగళవారం సంబంధిత శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కోసం గుర్తించిన స్థలానికి సంబంధించిన భౌగోళిక పరిస్థితులు, రవాణా సౌకర్యాలు, రహదారి అనుసంధానం, ప్రభుత్వ భూమి లభ్యత తదితర అంశాలను అధికారులు సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ఓర్వకల్ మండల కేంద్ర పరిధిలో అగ్నిమాపక కేంద్ర నిర్మాణం కోసం సుమారు 60 సెంట్ల స్థలాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన సాంకేతిక అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించి, అవసరమైన సూచనలు చేశారు. అలాగే అగ్నిమాపక కేంద్ర నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియలను వేగవంతం చేసి, శాఖల మధ్య సమన్వయంతో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో (ఇంచార్జ్) జిల్లా ఫైర్ ఆఫీసర్ బాలరాజు, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ బజారి, ఉప తహశీల్దార్ ఎం. సతీష్, మండల సర్వేయర్ శంకర్ మాణిక్యం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# జలధార – జలహారతి పనులతో భూగర్భ జలాల పెంపు

**చెరువుల అనుసంధానం ద్వారా రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం**
**జిల్లాలో జలధార -జలహారతి కింద 4,100 పనులు గుర్తింపు**
**2,100 పనులు మంజూరు ? 1,100 పనులకు గ్రౌండింగ్ పూర్తి**

జిల్లా కలెక్టర్ డా.ఏ. సిరికర్నూలు, మే 12 (శ్రీచక్ర): జిల్లాలో "జలధార – జలహారతి'' కార్యక్రమం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించడం జరుగుతుందని, తద్వారా చెరువుల అనుసంధానం చేసి రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా.ఏ. సిరి తెలిపారు. మంగళవారం ఓర్వకల్లు మండలం సోమయాజులవల్లె గ్రామంలో నిర్వహిస్తున్న జలధార?జలహారతి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమయాజులపల్లె చెరువులో చేపట్టిన పూడికతీత పనులను కలెక్టర్ ప్రారంభించి అక్కడ చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా సోమయాజులపల్లె చెరువులో చేపట్టిన పూడికతీత పనులను పరిశీలిస్తూ ఎక్కువ మంది ఉపాధి హామీ శ్రామికులకు ఉపాధి పనులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డ్వామా అధికారులను ఆదేశించారు.. ఇక్కడ చేపడుతున్న పూడికతీత పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డ్వామా అధికారులను ఆదేశించారు. చెక్ డ్యామ్ మరమ్మతులకు సంబంధించిన ఎస్టిమేట్ లు సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ డ్వామా పిడి ని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా జల హారతి కార్యక్రమంలో భాగంగా మొత్తం 4,100 పనులను గుర్తించామని, అందులో 2,100 పనులకు మంజూరు చేశామన్నారు. ఇప్పటికే 1,100 పనులు గ్రౌండింగ్ దశకు చేరుకున్నాయని, మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా భూగర్భ జలాల స్థాయిని పెంచడం, చెరువులను నింపడం, రైతులకు సాగునీరు అందించడం లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. సోమయాజులపల్లె చెరువు నీటి విస్తీర్ణం సుమారు 8.5 ఎఫ్‌టీఎం సామర్థ్యంతో ఉండగా, కొమరోలు ప్రాంతం నుండి వచ్చే ఫీల్డ్ వాటర్‌ను రాజుకత్వ కాలువ ద్వారా వర్షాకాలంలో చెరువులోకి మళ్లించేలా



ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. చెరువులో నీరు సమృద్ధిగా నిల్వ చేసిన అనంతరం అదనపు నీటిని కొమ్మచెరువుకు వెళ్తాయని, అక్కడి నుండి నంద్యాల జిల్లాలోని మంచాలకట్ట చెరువుకు నీటిని పంపించే విధంగా చెరువుల అనుసంధానం చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు. చెరువుకు చెరువు అనుసంధానం ద్వారా వర్షపు నీరు వృథా కాకుండా నిల్వ చేయడంతో పాటు భూగర్భ జలాల పెంపు సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ చెరువుకు సంబంధించిన పూడికతీత పనుల కోసం సుమారు 9.60 లక్షల రూపాయల లేబర్ కాంపోనెంట్ బడ్జెట్‌ను కేటాయించమన్నారు. దీని ద్వారా 3,000 పనిదినాలను కల్పిస్తున్నామన్నారు.. ప్రతిరోజూ సుమారు 100 మంది కూలీలు ఇక్కడ పనిచేస్తున్నారని, వీరికి 30 రోజుల పాటు ఉపాధి లభిస్తుందన్నారు. దీనివల్ల భూగర్భ జలాలు పెరగడమే కాకుండా, స్థానిక కూలీలకు ఉపాధి కూడా దొరుకుతుందన్నారు. ఉపాధి హామీ పనుల ద్వారా చెరువుల పూడికతీత, ముళ్ళ పొదల తొలగింపు, ఫీడర్ ఛానల్ల శుభ్రపరిచే పనులు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో నిండే చెరువులకు సంబంధించిన వాగులు, కాలువలు, ఫీడర్ ఛానల్లను శుభ్రపరిచడం ద్వారా అన్ని చెరువులు పూర్తిస్థాయిలో నిండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉపాధి హామీ శ్రామికులు ఉదయం 6 గంటలకే పనులకు హాజరై, ఉదయం 10 గంటలలోపు పనులు ముగించుకుని తిరిగి వెళ్లేలా చూసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పనులను శ్రామికులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కొన్ని ప్రాంతాల్లో జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు యంత్రాలతో చేయాల్సిన అవసరం ఉందని, వాటిని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.. జిల్లాలోని ప్రతి చెరువును పూడికతీత చేసి, ఫీడర్ చానళ్లను పునరుద్ధరించి, వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంపొందించడం ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇంచార్జి కర్నూలు ఆర్డీఓ అనురాధ, డ్వామా పిడి నరసింహ రెడ్డి, డ్వామా ఏపిడి పద్మ, ఓర్వకల్లు తహశీల్దార్ విద్యా సాగర్. సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జనాభా గణన సర్వే ఈ నెల 20వ తారీఖు లోగా పూర్తి చేయాలి :రాష్ట్రస్థాయి లో ముందు వరుసలో ఉండే లాగా కష్టపడాలి:జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి






కర్నూలు, మే 12 (శ్రీచక్ర): జనాభా గణన సర్వే మే 20 తారీఖు లోగా పూర్తి చేయాలని , జిల్లాను పట్టిక అగ్రస్థాయిలో నిలపాలని సెన్సెస్ రివ్యూ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ నుండి సెన్సెస్ పై మండల తాహసిల్దార్ లు , ఎంపీడీవోలు మరియు మునిసిపల్ కమిషనర్లతో ప్రత్యక్షంగా మరియు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో జనాభా గణన ను సిబ్బంది ఒక్కరు ప్రతి రోజూ 50 చొప్పున చేసి మే నెల 20వ తారీకు లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంకా కొన్ని ప్రదేశాలలో జనాభా గణన అసలు మొదలు పెట్టలేదని అందువలన ప్రస్తుతం జిల్లా వెనుకబడి ఉన్నదని కావున వారు వెంటనే మొదలుపెట్టి నిర్ణీత సమయంలోగా గణన పూర్తి చేయాలని ఆదేశించారు. జనాభా గణన సిబ్బంది ముందుగా సంబంధిత వ్యక్తి యొక్క వారి కుటుంబ విషయాలు రహస్యంగా ఉంచబడతాయని , ఇతరులకు తెలియజేయమని మరియు వారు పొందుతున్న పథకాల లబ్ది ఆగిపోదని వారికి తెలియజేప్పి సమాచారాన్ని సేకరించుకోవాలని తెలిపారు. అందులో వారికి ఉండే 35 ప్రశ్నలకు సరైన సమాధానం సేకరించుకోవాలని తెలిపారు. ఒక ఇంటి సమాచారాన్ని దాదాపు 10 నిమిషాల లోపల పూర్తి చేయవచ్చని తెలిపారు. ఉదయం 8 గంటల నుండి 4 గంటల పాటు మరియు సాయంకాలం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు జనాభా గణన చేసినచో త్వరగా పూర్తి అవుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమయాలలో అందరూ వారి గృహాలలో లేదా వారి వ్యాపారం,దుకాణ సముదాయాలలో అందుబాటులో ఉంటారని కావున ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకొని పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతిరోజు రాత్రి అధికారులు సిబ్బంది అందరితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించుకొని రేపు ఏ విధంగా జనాభా గణన సేకరణ చేయాలి అన్న విషయాలపై సూచనలు ఇచ్చి మరుసటి రోజు ఉదయం వారిని వారి ప్రదేశాలకు వెళ్లే లాగా ఆదేశించాలని వారిపై పూర్తి దృష్టి పెట్టి ప్రతి ఒక్కరూ వారికి చెందిన గణన పూర్తి చేసే విధంగా మానిటర్ చేయాలని తహసిల్దార్ , మున్సిపల్ కమిషనర్లు మరియు ఎంపీడీవోలను సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ విషయంపై ఇన్చార్జి డిఆర్ఓ చిరంజీవి మరియు కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేష్ తో సూచనలు ఇప్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్న కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేష్ ను అభినందించారు. జిల్లాలో ఆలూరు , కోసిగి , గోనెగండ్ల , ఎమ్మిగనూరు , కౌతాళం మొదలగు మండలాలలో ఇంతవరకు గణన బాగా చేసినందుకు అధికారులను అభినందించారు వారి నుండి ఇతరులకు సూచనలు కూడా ఇప్పించారు. ఇప్పటికీ వెనుకబడి ఉన్న మండల తహసిల్దారులను త్వరగా పూర్తి చేయాలని, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయని అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆదోని తహసిల్దార్ కు గట్టిగా హెచ్చరికలు జారీ చేశారు.ఈ సమావేశానికి డిఆర్ఓ చిరంజీవి , జిల్లా పరిషత్ సీఈవో వెంకటరమణారెడ్డి , డ్వామా పిడి నరసింహారెడ్డి , కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేష్ , జిల్లాలోని మండల తహసీల్దారులు , ఎంపీడీవోలు ప్రత్యక్షంగా మరియు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

# పురాణాలన్నీ విజ్ఞాన రహస్యాలే డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే

**వేముగోడులో ప్రారంభమైన తితిదే ధార్మిక కార్యక్రమాలు**



కర్నూలు, మే, 12 (శ్రీచక్ర): భారతీయ పురాణాలలో ఎంతో లోతైన విజ్ఞానం, తత్వం, ప్రకృతి పరిశీలన, జీవన విధానం దాగి ఉన్నదని, శ్రీమద్రామాయణం, మహాభారతం, భాగవత పురాణం వంటి గ్రంథాల్లో కేవలం భక్తి మాత్రమే కాకుండా ఖగోళ శాస్త్రం, వైద్యం, నైతికత, మనోవిజ్ఞానం, సమాజ నిర్మాణం వంటి అంశాలూ ఎన్నెన్నో కనిపిస్తాయని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు గుమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకట రెడ్డి అన్నారు. గోనెగండ్ల మండలం, వేముగోడు గ్రామంలోని శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి దేవస్థానంనందు నాలుగు రోజుల ధార్మిక కార్యక్రమాల సందర్భంగా వారు ప్రవచించారు. తదనంతరం స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షులు యాగంటి ఈశ్వరరెడ్డి, హార్మోనిష్టు జి. ఈరన్న, డక్కీ మాష్టారు ఎ. వీరన్న, తబలిష్ఠ కె. అర్జున్, వై.రాజారెడ్డి, బి. చిన్నయ్య, రంగన్న, ఎ. వినోద్, మద్దిలేటి, సి. ఉరుకుంద, యం. లక్ష్మణ్ణ, జి.రామాంజనేయులు, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మఠం హుండీ ఆదాయం రూ. 2.78 కోట్లు-శ్రీమఠ మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు




మంత్రాలయం,మే 12,(శ్రీచక్ర ): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం ఏప్రిల్ ,మే నెల 20 రోజుల హుండీ ఆదాయం రూ. 2,78,19,526లు సమకూరినట్లు మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు మంగళ వారం వెల్లడించారు. బంగారం 15.10 గ్రాములు , వెండి 751 గ్రాములను భక్తులు కానుకులుగా హుండీ లో సమర్పించుకున్నారని మేనేజర్ తెలిపారు.

## ఘనంగా హనుమాన్ జయంతి





మంత్రాలయం, మే 12,(శ్రీచక్ర) : నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా పాత ఊరులోని ఆంజనేయ స్వామి గుడి దగ్గర నుంచి రాఘవేంద్ర కూడలి మీదుగా ఉత్సవ మూర్తి శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని పల్లకిలో ఉంచి భాజా భజంత్రీలు, మంగళ వాయిద్యాలతో మంత్రాలయం పురవీదుల మీదుగా కొండాపురం ఆంజనేయ స్వామి దేవాలయం వరకు భారీ శోభ యాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు కొండాపురం ఆంజనేయ స్వామికి ఆకు పూజ, పంచామృతాభిషేకం తదితర విశేష పూజలు చేశారు. ఆలయం చుట్టూ స్వామి విగ్రహాన్ని పల్లకి లో ఊరేగించారు. గ్రామ ప్రజలు, భక్తులు స్వామి వారిని దర్శించుకుని ఆలయ సిబ్బంది ఏర్పాటు చేసిన అన్న దాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, గంగపుత్ర సంఘం అధ్యక్షులు హండే శాంతయ్య, హండే హనూమంతు, హండే గోపాల్ , గ్రామ పెద్దలు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## కిశోరీ వికాసం సమ్మర్ సెషన్ - బాలికల అవసరాలు, సవాళ్లపై అవగాహన



మంత్రాలయం, మే 12,(శ్రీచక్ర ): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరీ వికాసం సమ్మర్ సెషన్-4లో భాగంగా "నా అవసరాలు మరియు మన సవాళ్లు" అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.సూపర్వైజర్ వీర గోవిందమ్మ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు సునీత, భాగ్యమ్మ, కవిత ఈ సెషన్‌ను నిర్వహించారు. "ఇక్కడ చెప్పేది గోప్యం" అనే నియమంతో బాలికలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించారు. "నా రోజు" యాక్టివిటీ ద్వారా వారి దినచర్య, కష్టాలు తెలుసుకున్నారు. "నాకు అవసరం", "నాకు ఇబ్బంది" కార్డుల ద్వారా బాలికల సమస్యలను సేకరించారు.బాలికల అవసరాలు, భావాలు, అభిప్రాయాలు ముఖ్యమని, వాటిని వ్యక్తపరచడం హక్కు అని వివరించారు. ఆరోగ్యం, భద్రత, విద్య భవిష్యత్తుకు కీలకమని తెలిపారు. సమస్యలు చెబితే పరిష్కారం దొరుకుతుందని, స్నేహితులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల సాయం తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు, వేధింపులపై 1098 చైల్డ్ లైన్‌కు ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చారు

## నెల్లూరులో జరగబోయే టీడీపి మహానాడు ఏర్పాట్లపై జిల్లా పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే బీవీ,





ఎమ్మిగనూరు, మే, 12 (శ్రీ చక్ర): ఎమ్మిగనూరు ఆర్ డ బి గెస్ట్ హౌస్ లో మరియు కర్నూలు జిల్లా టిడిపి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి నెల్లూరులో జరిగే మహానాడు-2026 వ ఏర్పాట్లపై పార్టీ జిల్లా నాయకులు, పార్టీ కార్యకర్తలతో, గ్రామీణ ప్రాంత టిడిపి ముఖ్య నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పట్టణ మరియు మండల కమిటీ నాయకులు, క్లస్టర్ కన్వీనర్లు, మార్కెట్ యార్డు చైర్మన్ మరియు కార్యకర్తలతో సమావేశమై, ఈ నెల 20వ తేదీన కుర్నీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్న ఎమ్మిగనూరు నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమంపై చర్చించారు. అనంతరం టీడీపీ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ తో కలిసి పార్లమెంట్ స్థాయి మహానాడు ఏర్పాట్లపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.టీడీపీ 44వ వార్షిక మహానాడు 2026 మే 27 నుండి 29 వరకు నెల్లూరు జిల్లా కోడవలూరులోని ఐఎఫ్ఎఫ్‌సీవో కిసాన్ ఎస్ఈజెడ్‌లో నిర్వహించనున్న నేపథ్యంలో, పార్టీ భవిష్యత్ కార్యాచరణ, తీర్మానాలు మరియు ప్రజా సమస్యలపై విస్తృత చర్చలు జరగనున్నాయని తెలిపారు. తొలి రెండు రోజులు ప్రతినిధుల సమావేశాలు, చివరి రోజు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ప్రయాణం, వసతి, భోజన ఏర్పాట్లు, తీర్మానాల సిద్ధం, ప్రతినిధుల సమన్వయం వంటి అన్ని ఏర్పాట్లను సమర్థంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర్ రెడ్డి నాయకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, ఏఎంసీ చైర్మన్, ప్యాక్స్ అధ్యక్షులు, పట్టణ మరియు మండల కమిటీ నాయకులు, క్లస్టర్ కన్వీనర్లు మరియు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## 13వ తేదీ బుధవారం చెందోడు లో రక్తదాన శిబిరం

కోట : మే 12 (శ్రీ చక్ర): కోట మండలం చెందోడు గ్రామంలో మే 13 వ తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు రక్తదాన శిభిరం నిర్వహిస్తున్నట్లు ఎం వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ తెలిపారు.ఈ రక్తదాన శిబిరంలో 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వరకు వయసు ఉన్నవారు, మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసేవారు ప్రతి ఒక్క రక్తదాత నేడు రక్తనిల్వ కేంద్రాలలో రక్తం లేక ఇబ్బందులు పడుతున్న దృశ్య ప్రతి ఒక్క రక్తదాత స్పందించి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని ఆయన కోరారు.గూడూరు మెడిపల్స్ రక్తనిధి కేంద్రం ద్వారా రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరిస్తారని కావున ప్రతి ఒక్క రక్తదాత స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని రక్షించాలని లీలా మోహన్ కృష్ణ కోరారు. రక్తదానం చేసేవారు ఈ క్రింది నెంబర్ను సంప్రదించవలసిందిగా కోరుచున్నాము

## గృహ గణన ప్రక్రియను వేగవంతం చేస్తున్న తాహసిల్దార్



కోట : మే 12 (శ్రీ చక్ర): మండలంలోని గృహ గణన ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని కోట తాహాసిల్దార్ కటారి.జయ జయ రావు అన్నారు.ఈ సందర్బంగా మండల పరిధిలోని వంజివాక గ్రామంలో గృహ గణన ప్రక్రియను ఏర్పాటు చేశారు.ఈ మేరకు వంజివాక గ్రామంలో రెవెన్యూ అధికారులు చేపట్టిన గృహ గణన ప్రక్రియను కోట తాహాసిల్దార్ కటారి.జయ జయ రావు క్షుణ్ణంగా పరిశీలించారు.అదేవిధంగా గృహ గణన ప్రక్రియ విధానంలో ఎలాంటి తారతమ్యాలు లేకుండా కుటుంబంలో ఉన్న సభ్యులు, తదితర విషయాలను క్షుణ్ణంగా తెలుసుకొని యాప్ లో నమోదు చేయాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వంజివాక విఆర్వో కృష్ణయ్య,సచివా లయ ఉద్యోగస్తులు సుధాకర్ ఉన్నారు

## మున్సిపల్ సిబ్బందికి ఘన సత్కారం



శ్రీకాళహస్తి, మే12(శ్రీచక్ర): శ్రీకాళహస్తి పురపాలక సంఘంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను అంకితభావంతో పనిచేసి, ఉత్తమ సేవలు అందించిన మున్సిపల్ సిబ్బందికి 'సేవా పురస్కారాలు' అందజేసి, పట్టువస్త్రాలతో ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పురపాలక సంఘాల్లో శ్రీకాళహస్తి 7వ స్థానంలో నిలవడం మనందరికీ గర్వకారణం అని స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ అన్నారు. పట్టణ పరిశుభ్రత (శానిటేషన్) నుండి పన్నుల వసూళ్ల వరకు ప్రతి విభాగంలోనూ నిరంతరం శ్రమిస్తున్న మున్సిపల్ కార్మికులు మరియు సిబ్బంది కృషి ఎంతో అభినందనీయం అన్నారు. మన పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడంలో వీరి పాత్ర ఎంతో కీలకం. ఇదే ఉత్సాహంతో రానున్న రోజుల్లో కూడా ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలందించాలని కోరుకుంటున్నాను అన్నారు. కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ మన ప్రభుత్వం ఎల్లప్పుడూ సముచిత గౌరవం కల్పిస్తుందన్న భావన వ్యక్తపరచారు.ఈ కార్యక్రమం లో నాయకులు, అధికారులు,ఇతరులు పాల్గొన్నారు.

## తిన్నెలపూడిలో 'బడి పిలుస్తోంది' సందడి...,ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థుల మొగ్గు...,ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం....కోట ఎంఈఓ-1 శిరీష...,

కోట : మే 12 (శ్రీ చక్ర): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడం,విద్యా ప్రమాణాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా విద్యాశాఖ చేపట్టిన 'బడి పిలుస్తోంది' కార్యక్రమం తిన్నెలపూడిలో ఉత్సాహంగా నిర్వహించబడింది. ప్రభుత్వ బడులలో ఉన్న వసతులు,నాణ్యమైన బోధనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక పాఠశాల నుండి గ్రామ ప్రధాన కూడళ్ల వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి అవగాహన ర్యాలీని చేపట్టారు.ఈ సందర్భంగా కోట మండల విద్యాశాఖ అధికారి-1 శిరీష మాట్లాడుతూ ప్రతి చిన్నారిని బడిలో చేర్పించడం తల్లిదండ్రుల బాధ్యత అని, ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా అందించే బోధన విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గం చూపుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించడం, డ్రాపౌట్లను పూర్తిగా అరికట్టడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని ఆమె వివరించారు.అనంతరం ప్రధానోపాధ్యాయులు సుమాయిష్, ఉపాధ్యాయ బృందంతో కలిసి అధికారులు ప్రతి ఇంటినీ సందర్శించి ప్రభుత్వ విద్యా పథకాలను వివరించగా, దానికి మంచి స్పందన లభించింది. ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా నూతనంగా 8 మంది విద్యార్థులు పాఠశాలలో ప్రవేశం పొందగా, వారిలో నలుగురు విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలను వదిలి ప్రభుత్వ పాఠశాలలో చేరడం విశేషం. ఇది ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమని అధికారులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొని విద్యావశ్యకతపై నినాదాలు చేస్తూ గ్రామస్తులను చైతన్యపరిచిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.



## ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాల విద్యాసంస్థల దోపిడిని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్,




ఎమ్మిగనూరు, మే, 12 (శ్రీ చక్ర): -ఎమ్మిగనూరు పట్టణంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ పట్టణ ముఖ్య నాయకుల సమావేశం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు గఫూర్,ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.షాబీర్ భాష మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడి పై భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ గురించి చర్చించారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో అత్యధిక ఫీజులతో విద్యార్థులను వేధిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం నిద్రమత్తులో జోగుతున్నారని విమర్శించారు. పట్టణంలోని గుర్తింపు లేని ప్రైవేట్ పాఠశాలలన్నింటినీ జిల్లా విద్యాశాఖ అధికారులు గుర్తించి వెంటనే రద్దు చేయాలని కోరారు.ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు హాజీ, శివ, వీరేష్, చరణ్, మోహన్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామస్తులకు పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు హోమియో మందులు పంపిణీ..,అంగన్వాడీ కేంద్రానికి విద్యా సామాగ్రి పంపిణీ..,



కోట : మే 12 (శ్రీ చక్ర):చిల్లకూరు మండలం పల్లమాల గ్రామానికి చెందిన గూడూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రానికి అవసరమైన విద్యాసామాగ్రి మరియు వేసవికాలంలో వచ్చే సీజనల్ వ్యాధులకు అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా హోమియో మందులను మంగళవారం హనుమ జయంతిని పురస్కరించుకొని కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన ఎం.వి. రావు ఫౌండేషన్ నిర్వాహకు లు పంపిణీ చేశారు.అంగన్వాడీ కేంద్రంలోని ఉపాధ్యాయిని,సహాయకురాలు విజ్ఞప్తి మేరకు అంగన్వాడి కేంద్రానికి అవసరమైన చాపలు విద్యాసామాగ్రిని అందించడమే కాకుండా,ఆ కేంద్రంలో విద్యను అభ్యసించే చిన్నారులకు, గ్రామస్తులకు చికెన్ ఫాక్స్ మరియు ఇతర వేసవి కాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు శోకకుండా ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా హోమియో మందులను అందరికీ పంపిణీ చేశారు.హనుమ జయంతి సందర్భంగా హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాదాన్ని స్థానికులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎం వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం విజయలక్ష్మి, పల్లమాల అంగన్వాడి కేంద్రం ఉపాధ్యాయిని సహాయకురాలు గ్రామస్తులు చిన్నారులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు...,



కోట : మే 12 (శ్రీ చక్ర): కోట పట్టణం తూర్పు వీధిలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఉదయం 108 మంది భక్తులతో హనుమాన్ చాలీసా 11 సార్లు భక్తిశ్రద్ధలతో చదివారు. అనంతరం వివిధ రకాల ద్రవ్యములతో పంచామృత అభిషేకం నిర్వహించారు.ఆలయ ధర్మకర్త కొడవలూరు సుబ్బారెడ్డి శైలజమ్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.హనుమాన్ మూల విరాటకు వివిధరకాల పూలతో,తమలపాకుల మాలతో ముస్తాబు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.సాయంత్రం హనుమాన్ భక్త బృందంతో శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానము నుండి గాంధీ బొమ్మ సెంటర్,ఆర్టీసీ కూడలి ప్రాంతం,నల్లపరెడ్డి గోపాల్ రెడ్డి బొమ్మ సెంటర్,తిమ్మనాయుడుపాలెం,వెంకన్నపాలెం,కోట అడ్డ రోడ్డు,పుర వీధులలో జై హనుమాన్ అనునినాదాలతో ద్విచక్ర వాహనాలపై భారీ శోభాయాత్ర నిర్వహించారు. సాయంత్రం విద్యుత్ కాంతులతో,బాణాసంచా వేడుకలతో,మంగళ వాయిద్య ములతో అత్యంత వైభవంగా పల్లకి సేవ నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకలు ప్రసాదు స్వామిమాట్లాడుతూ వైశాఖ మాసంలో కృష్ణపక్ష దశమ నాడు పూర్వాభద్ర నక్షత్రంలో ఆంజనేయ స్వామి జన్మించారు కాబట్టి హనుమాన్ జయంతిని అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.

# నిమ్మరసం ఖాళీ కడుపుతో తాగుతున్నారా? అయితే ఈ హెచ్చరిక!



ఉదయం ఖాళీ కడుపుతో వెచ్చని నీటిలో నిమ్మరసం కలిపి తాగడం మనలో చాలామందికి రోజువారీ అలవాటు. బరువు తగ్గడం, జీర్ణక్రియ మెరుగుపరచడం, శరీరం డీటాక్స్ చేయడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని చెప్తారు. కానీ ఆరోగ్య నిపుణులు మాత్రం ఉదయం ఖాళీ కడుపుతో నిమ్మరసం తాగటం మంచిది కాదంటున్నారు. ఖాళీ కడుపుతో నిమ్మరసం తాగడం ఆరోగ్యవంతమైన వ్యక్తులలో కూడా ప్రతికూల ప్రభావాలు చూపుతుందని హెచ్చరిస్తున్నారు. ఉదయాన్నే నిమ్మరసం తాగితే ఈ సమస్యలు నిమ్మకాయలోని ఆమ్లత్వం ఎక్కువగా ఉండటం వల్ల దీర్ఘకాలం ఖాళీ కడుపుతో సేవించడం ఎముకల ఆరోగ్యానికి హాని కలిగించవచ్చు. ఇది శరీరంలో కాల్షియం స్థాయిని ప్రభావితం చేసి ఎముకల సాంద్రత తగ్గడానికి ఆస్టియోపోరోసిస్ కు దారితీయవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళలు మరియు వయసు మీరిన వారు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఉదయాన్నే నిమ్మరసం తాగితే దంతాలకు డేంజర్ ఉదయానే నిమ్మరసం తాగటం దంతాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. నిమ్మరసంలోని ఆమ్లం దంతాల ఎనామిల్ పొరను క్రమంగా కరిగించి, పళ్లు సున్నితం చేసి, పళ్ళ సెన్సిటివిటీ సమస్యలను పెంచుతుంది. రోజూ ఖాళీ కడుపుతో తాగేవారిలో దంత సమస్యలు ఎక్కువగా ఉంటాయని డెంటిస్టులు చెప్తారు. అతిగా ఉదయాన్నే నిమ్మరసం తాగితే ఈ సమస్యలు అతిగా నిమ్మరసం తాగడం వల్ల శరీరంలో నీటి సమతుల్యం దెబ్బతింటుంది. ఆస్కార్బిక్ యాసిడ్ మూత్రపిండాల ద్వారా నీటిని ఎక్కువగా విసర్జించడానికి కారణమవుతుంది. దీంతో నిర్జలీకరణ, తలనొప్పి, అలసట వంటి సమస్యలు ఎదురవుతాయి.జీర్ణ సంబంధిత సమస్యలు మరింత తీవ్రం అవుతాయి. ఖాళీ కడుపుతో నిమ్మరసం తాగడం వల్ల కడుపులో ఆమ్లాలు పెరిగి ఎసిడిటీ, మంట, గుండెల్లో నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు వంటి ఇబ్బందులు వస్తాయి. మూత్రపిండాలపై నిమ్మరసం ప్రభావం కొంతమందిలో కడుపు అల్సర్ వంటి సమస్యలు కూడా ఏర్పడే అవకాశం ఉంది. మూత్రపిండాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంది. అధిక మోతాదులో నిమ్మరసం దీర్ఘకాలం తీసుకోవడం వల్ల కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదం పెరుగుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. నిపుణులు చెప్తుంది ఇదే నిమ్మరసం ఆరోగ్యానికి మంచిదే, కానీ ఖాళీ కడుపుతో కాకుండా ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత లేదా భోజనంతో పాటు తక్కువ మోతాదులో తాగడం మంచిది. ఇప్పటికే ఎసిడిటీ, కిడ్నీ సమస్యలు ఉన్నవారు డాక్టర్ సలహా తీసుకోవాలి.

# ప్రతి రోజూ అరటి పండ్లు తింటున్నారా..?



అరటిపండు. పోషకాలతో నిండిన పండు. ఇందులో :6, విటమిన్ అ పుష్కలంగా ఉంటాయి. మెగ్నిషియం, పొటాషియం మాంగనీస్, ఫైబర్ లు అరటి పండులో మెండుగా ఉంటాయి. అరటి పండ్లు మంచి శక్తి వనరు. అరటిపండ్లలో సహజ కార్బోహైడ్రేట్లు, సహజ చక్కెరలు (గ్లూకోజ్, ఫ్రక్టోజ్, సుక్రోజ్) సమృద్ధిగా ఉంటాయి. ప్రతి రోజూ అరటి పండ్లు తింటే ఆరోగ్యానికి మంచిదా? కాదా? అనే సందేహం చాలా మందికి ఉంటుంది. దీని పైన నిపుణులు స్పష్టత ఇస్తున్నారు. అరటి పండుతో ఆరోగ్యానికి ఎలా ప్రయోజనమో వివరిస్తున్నారు. అరటి పండును మితంగా తింటే నష్టమేమీ ఉండదు. రోజుకి రెండు లేదా మూడు పండ్లు తింటే సమస్య ఉండదని డాక్టర్లు చెబుతారు. అరటిపండ్లలో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది మలబద్ధకాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. వాటిలో ఉండే పెక్టిన్ జీర్ణ ప్రక్రియను సులభతరం చేస్తుంది. పేగులో ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా పెరుగుదలకు సహాయపడుతుంది. అరటిపండ్లలో పొటాషియం కూడా అధికంగా ఉంటుంది. పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది. గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించడంలోనూ సహాయపడుతుంది. ఇది మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అరటిపండ్లు ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లాన్ని అందిస్తాయి. ఇది సెరోటోనిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. నిపుణుల సూచనలు అరటి పండు మంచి మానసిక స్థితిని కాపాడుకోవడంలో, ఒత్తిడిని తగ్గించడంలో సెరోటోనిన్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. పొటాషియం, మెగ్నీషియం కండరాలను బలంగా ఉంచడంలో, తిమ్మిరిని తగ్గించడంలో సహాయపడతాయి. అరటిపండ్లు ఎక్కువగా తినడం వల్ల రక్తంలో పొటాషియం స్థాయిలు పెరుగుతాయి. ఇది మూత్రపిండాల సమస్యలు, గుండె క్రమరాహిత్యాలకు కారణమవుతుంది. కానీ ఇది చాలా అరుదు. అయితే అరటి పండ్లు మూత్రపిండ రోగులకు ప్రమాదం. డయాబెటిక్(సుగర్) ఉన్నవారు అరటి పండ్లను తినొద్దు. ఇందులో ఉండే ఫ్రక్టోజ్ రక్తంలో చెక్కర స్థాయిలను పెంచుతుంది. చెక్కెర స్థాయిలు పెరిగితే దానివల్ల ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. సుగర్ లెవెల్స్ ఎక్కువగా ఉన్నవారు వీటి జోలికి పోకపోతేనే మంచిది. నార్మల్ లెవెల్స్ మెయింటేన్ చేసేవారు ఎక్కవగా పండని, దోరగా ఉన్న పండును ఉదయం సగం, సాయంత్రం సగం తినొచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# వాము చేసే మేలు అన్నీ ఇన్నీ కావు



అజ్వైన్.. దీనిని వాము అని కూడా పిలుస్తారు. మన వంటకాలు, సాంప్రదాయ వైద్యంలో విస్తృతంగా ఉపయోగించే ఒక మసాలా దినుసు. థైమోల్ అనే సమ్మేళనం ఇందులో అధికంగా ఉండటం వల్ల దీనికి ఘాటైన, కొంత చేదు రుచి ఉంటుంది. థైమోల్ యాంటీ బాక్టీరియల్, జీర్ణశక్తిని మెరుగుపరిచే లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. ఈ సుగంధ ద్రవ్యం అనేక ఆరోగ్య ప్రయోజనాలతో నిండి ఉంటుంది. రోజువారీ ఆహారంలో వామును చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని ఎలా మెరుగుపర్చుకోవచ్చనేది ఇప్పుడు తెలుసుకుందాం. అజ్వైన్ ద్వారా కలిగే కొన్ని ముఖ్యమైన ప్రయోజనాలు ఇవీ. 1. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది అజ్వైన్ జీర్ణ ఎంజైమ్‌లను ఉత్తేజపర్చుతుంది. ఇది ఆహారాన్ని సమర్థవంతంగా విచ్ఛిన్నం చేయడానికి సహాయపడుతుంది. వాములో ఉండే థైమోల్ గ్యాస్ట్రిక్ స్రావాన్ని పెంచుతుంది. దీంతో అజీర్ణం, ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు మటుమాయమౌతాయి. 2. అసిడిటీ, గుండెల్లో మంటను తగ్గిస్తుంది అజ్వైన్ సహజ యాంటాసిడ్‌గా పనిచేస్తుంది. ఇది కడుపులోని ఆమ్లాన్ని తటస్థీకరించి, యాసిడ్ రిఫ్లక్స్, గుండెల్లో మంట, కడుపు నొప్పి నుండి ఉపశమనం ఇస్తుంది. దీని ఆల్కలైన్ లక్షణాలు.. కడుపులో పీహెచ్ సమతుల్యతను కాపాడటానికి సహాయపడతాయి. 3. జీవక్రియను, బరువు తగ్గడాన్ని ప్రోత్సహిస్తుంది వాము గింజలు జీవక్రియను వేగవంతం చేసి, కొవ్వు జీర్ణం కావడాన్ని మెరుగుపరుస్తాయి. వాటి థర్మోజెనిక్ లక్షణాలు ఆకలిని నియంత్రించడంతో పాటు కేలరీలను వేగంగా బర్న్ చేయడంలో సహాయపడతాయి. 4. దగ్గు, జలుబు నుండి ఉపశమనం అజ్వైన్ యాంటీ–బాక్టీరియల్, యాంటీ–వైరల్, యాంటీ–ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంది. ఇది దగ్గు, ఛాతీ పట్టేయడం, శ్వాసకోశ సమస్యలకు చికిత్స చేయడంలో ప్రభావవంతంగా ఉంటుంది. ఇది శ్వాసనాళాల నుండి కఫాన్ని తొలగించి, గొంతు నొప్పిని తగ్గిస్తుంది. 5. మంటను, కీళ్ల నొప్పులను తగ్గిస్తుంది అజ్వైన్‌లో యాంటీ–ఇన్‌ఫ్లమేటరీ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి కీళ్ల నొప్పి, ఆర్థరైటిస్, కండరాల దృఢత్వం నుండి ఉపశమనం కలిగిస్తాయి. వాము నూనెను రాయడం లేదా నొప్పులుగా ఉన్న కీళ్లను వాము కలిపిన నీటిలో నానబెట్టడం వల్ల నొప్పి తగ్గుతుంది. క్రమం తప్పకుండా వాము నీటిని తీసుకోవడం అంతర్గత మంటను, దృఢత్వాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. 6. రక్తపోటును నియంత్రిస్తుంది వాములో ఉండే సమ్మేళనాలు సహజమైన వాసోడైలేటర్లుగా పనిచేస్తాయి, రక్త నాళాలను సడలించి, రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఇది అధిక రక్తపోటును నియంత్రించడంలో, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. 7. ఇన్ఫెక్షన్లతో పోరాడి ప్రేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది అజ్వైన్‌లో బలమైన యాంటీ–మైక్రోబియల్, యాంటీ–ఫంగల్ లక్షణాలు ఉన్నాయి. ఇది హానికరమైన బ్యాక్టీరియా, పరాన్నజీవులు, ఇన్ఫెక్షన్ల నుండి ప్రేగులను రక్షించడంలో సహాయపడుతుంది. ఫుడ్ పాయిజనింగ్, అతిసారం, కడుపు ఇన్ఫెక్షన్లకు చికిత్స చేయడంలో ఇది ప్రత్యేకంగా ఉపయోగ పడుతుంది. 8. రుతుక్రమ నొప్పిని తగ్గిస్తుంది వాము దాని కండరాలను సడలించే, యాంటీ–ఇన్‌ఫ్లమేటరీ లక్షణాల వల్ల రుతుక్రమ తిమ్మిర్లను తగ్గించి, క్రమరహిత రుతుక్రవాలను నియంత్రిస్తుంది. ఇది రుతుక్రమంలో ఉబ్బరం, నీరు నిలుపుదలని తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. 9. శ్వాసకోశ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది అజ్వైన్ బ్రోన్చియల్ ట్యూబ్‌లను విస్తృతం చేసి, సులభంగా శ్వాస తీసుకోవడానికి సహాయపడుతుంది. ఇది ఆస్తమా, బ్రోన్కైటిస్, ఇతర శ్వాసకోశ సమస్యలతో బాధపడే వారికి ప్రయోజనకరంగా ఉంటుంది. 10. నోటి ఆరోగ్యాన్ని పెంచుతుంది అజ్వైన్ యాంటీ బాక్టీరియల్ లక్షణాలు దుర్వాసన, నోటి ఇన్ఫెక్షన్లు, పంటి నొప్పిని ఎదుర్కోవడానికి సహాయపడతాయి. థైమోల్ సహజ యాంటీసెప్టిక్‌గా పనిచేసి, నోటిలో బ్యాక్టీరియా వృద్ధిని నివారిస్తుంది.

# పిల్లలకు ఇష్టమైన 'మైసూర్ పాక్'.. ఇంట్లోనే ఇలా ఈజీగా తయారు చేసుకోండి..!



పిల్లలకు స్వీట్స్ అంటే చాలా ఇష్టం. అయితే స్వీట్స్ ను ఎక్కువగా బయటి నుంచి కొనుగోలు చేయడానికి ఎక్కువగా ఇష్టపడుతుంటారు. ఇంట్లో చేసుకోవడానికి చాలామంది ఇబ్బంది పడుతుంటారు. అయితే ఇంట్లోనే ఈజీగా మైసూర్ పాక్ ఎలా తయారు చేసుకోవాలి..? కావాల్సిన పదార్థాలు ఏంటి..? మైసూర్ పాక్ తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే శనగపిండి ఒక కప్పు, పంచదార రెండు కప్పులు, నెయ్యి 1.5 కప్పులు, నూనె అర కప్పు, నీరు అర కప్పు, యాలకుల పొడి అర టేబుల్ స్పూన్ తీసుకోవాలి. ఇక మైసూర్ పాక్ తయారీ విధానం చూస్తే ముందుగా శనగపిండిని జల్లించుకోవాలి. నెయ్యి, నూనెను ఒక పాత్రలో కలిపి సన్నటి మంటపై వేడి చేయాలి. ఇప్పుడు మరో మందపాటి పాత్రను తీసుకోవాలి. అందులో పంచదార అలాగే కలిపిన పాకం పెట్టుకోవాలి. తీగ పాకం రాగానే యాలకుల పొడి వేయాలి. ఇప్పుడు జల్లించిన శనగపిండిని కొద్దికొద్దిగా పంచదార పాకంలో వేస్తూ ఉండలు కట్టకుండా కలుపుతూ ఉండాలి. ఇప్పుడు మరుగుతున్న వేడి నెయ్యి– నూనె మిశ్రమాన్ని ఒక్కో గరిటెడు శనగపిండి మిశ్రమంలో వేస్తూ వేగంగా కలుపుతూ ఉండాలి. పిండి అంతా నెయ్యి పీల్చుకున్నంత వరకూ ఇలాగే చేయాలి. మిశ్రమం దగ్గరపడి పాత్ర అంచుల నుంచి విడిపోవడం ప్రారంభించిన వెంటనే నెయ్యి రాసిన ట్రేలో పోసి సమానంగా పరచాలి. కొద్దిగా చల్లారిన తర్వాత మీకు నచ్చిన ఆకారంలో చతురస్రాకారం లేదా వజ్రాకారంలో ముక్కలుగా కట్ చేసుకోవాలి. అంతే సూపర్ టేస్టీ మైసూర్ పాక్ రెడీ అయినట్టే..

# కోడిగుడ్డు రోటి పచ్చడి : సరికొత్త రుచి, 10 నిమిషాల్లో సిద్ధం!




ప్రతీరోజూ మనం రకరకాల పచ్చళ్ళు చేసి తింటాం . అయితే చాలా వెరైటీ గా కోడిగుడ్డు రోటి పచ్చడి ఉంటుంది. ఎంతో రుచికరంగా ఉండే ఈ రోటి పచ్చడి మనకు అన్నం, రోటీ, దోస, ఇడ్లీలతో అద్భుతంగా సరిపోతుంది. దీనిని తయారు చేయటం ఎలాగో ఒకసారి చూద్దాం. కావాల్సిన పదార్థాలు కోడిగుడ్లు ? 3–4 పచ్చి మిర్చి ? 5–6 ఎండు మిర్చి ? 4–5 ఉల్లిపాయలు ? 2 (ముక్కలు చేసినవి) టమాటాలు ? 2 (కట్ చేసుకున్నవి) వెల్లుల్లి ? 4–5రేకులు ఆవాలు ?½ టీస్పూన్ జీలకర్ర ?½ టీస్పూన్ కరివేపాకు ? 1–2రెమ్మలు కొత్తిమీర – కొద్దిగా పసుపు ? చిటికెడు ఉప్పు ? రుచికి తగినంత నూనె ? 2–3టేబుల్ స్పూన్లు తయారీ విధానం ముందుగా పాన్‌లో నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర వేసి పాప్ చేయాలి. తర్వాత అందులో పచ్చి మిర్చి 6, ఎండు మిర్చి వేసి కొద్దిగా నూనె వేసి వేయించాలి. ఆపై అందులో కట్ చేసి పెట్టుకున్న ఉల్లిపాయ ముక్కలు వేసి వేయించాలి. వాటిని తీసి పక్కన పెట్టుకుని, అందులోనే కట్ చేసి పెట్టుకున్న టమాటా ముక్కలు వేసి మగ్గించాలి విపరీతంగా నిద్ర వస్తుందా? కారణాలు ఇవే కావచ్చు.. జాగ్రత్త! రుచికరమైన కోడిగుడ్డు రోటి పచ్చడి ఇలా ఆపై ఈ మిశ్రమాన్ని అంతటినీ రోట్లో వేసి 6 వెల్లుల్లి, జీలకర్ర, కరేపాకు, కొత్తమీర వేసి పచ్చడిలా నూరుకోవాలి. అందులో రుచికి తగ్గట్టు ఉప్పు వేసుకోవాలి. ఒకవేళ కారం సరిపోకుంటే కొద్దిగా కారప్పొడి ని కూడా యాడ్ చేసుకోవచ్చు. ఆపై ఉడికించిన కోడిగుడ్డును కట్ చేసి, తురుముకుని పచ్చడిలో కలిపితే రుచికరమైన కోడిగుడ్డు రోటి పచ్చడి తయారవుతుంది. ఈ కోడిగుడ్డు రోటి పచ్చడి ఒక్కసారి చేసి చూస్తే మళ్లీ మళ్లీ చేయాలనిపిస్తుంది.

# వాస్తు ప్రకారం నరదిష్టికి గుమ్మడికాయ కడుతుంటే 3 తప్పులు చేయకూడదు

భారతీయ సంస్కృతిలో ఇంటి ముఖద్వారం కేవలం లోపలికి వెళ్లే దారి మాత్రమే కాదు, అది లక్ష్మీదేవి నివాసం ఉండే పవిత్ర స్థలం. అందుకే కొత్త ఇల్లు కట్టినా, వ్యాపారం మొదలుపెట్టినా మన కళ్లు మొదట వెతికేది 'బూడిద గుమ్మడికాయ' కోసం. "నరుని దృష్టికి నల్ల రాయి కూడా పగులుతుంది" అన్న సామెతను బలంగా నమ్మే మన సమాజంలో, ఈ గుమ్మడికాయ దిష్టి నుంచి రక్షణ కల్పిస్తుంది. హైటెక్ భవనాల నుంచి పల్లెటూరి పూరిళ్ల వరకు గుమ్మం పైన వేలాడే ఈ కాయ వెనుక ఉన్న అంతరార్థం, ఆచరించాల్సిన నియమాల గురించి తెలుసుకుందాం. ఎందుకంటే తరతరాలుగా మన సమాజంలో బూడిద గుమ్మడికాయ ఆచారం ఉంది కాబట్టి. దృష్టిని మళ్లించే వికృత రూపం సాధారణంగా బూడిద గుమ్మడికాయపై రంగులతో వికృతమైన బొమ్మలు గీయడం మనం చూస్తుంటాం. దీని వెనుక ఒక ఆసక్తికరమైన సైకాలజీ ఉంది. ఎవరైనా ఈర్ష్యతోనో లేదా అతిశయంతోనో ఇంటిని చూసినప్పుడు, వారి దృష్టి నేరుగా ఇంటిపై పడకుండా ఆ వికృత రూపం ఆకర్షిస్తుంది. అంటే, నెగెటివ్ ఎనర్జీని తనలోకి లాగేసుకుని ఇంటి యజమానికి రక్షణనిస్తుంది. అందుకే పసుపు, కుంకుమలు అద్ది, నల్ల దారంతో చుట్టి, నిమ్మకాయలతో కలిపి దీనిని వేలాడదీస్తారు. పాటించాల్సిన ముఖ్యమైన నియమాలు గుమ్మడికాయను కట్టేటప్పుడు మనలో చాలామంది చేసే చిన్న చిన్న పొరపాట్లు ఆ ఆచార ఫలితాన్ని తగ్గించవచ్చు. పండితుల సూచనల ప్రకారం ఇవి గుర్తుంచుకోవాలి. మార్కెట్ నుంచి తెచ్చిన గుమ్మడికాయను నీటితో అస్సలు కడగకూడదు. అలా చేస్తే దానిలోని దైవ శక్తి హరించుకుపోతుందని శాస్త్రం చెబుతోంది. గుమ్మడి కాయకు తొడిమ ఉండటం అత్యవసరం. తొడిమ లేని గుమ్మడికాయ 'నిర్జీవమైనది'గా లెక్క. శుభ సమయం దీనిని కట్టడానికి అమావాస్య అత్యంత ప్రశస్తమైన రోజు. అమావాస్య సూర్యోదయానికి ముందే కడితే నరదిష్టి ప్రభావం శూన్యమవుతుంది. వీలుకాకపోతే బుధ లేదా శనివారాల్లో ఉదయం పూట కట్టవచ్చు. కానీ సూర్యాస్తమయం తర్వాత మాత్రం ఎప్పుడూ కట్టకూడదు. మార్చాల్సిన సమయం ఎప్పుడు? గుమ్మడికాయ ఇంటి ముందు ఉన్న నెగెటివ్ ఎనర్జీని స్పాంజ్ లాగా పీల్చుకుంటూ ఉంటుంది. కాబట్టి ప్రతి అమావాస్యకు పాతది తీసి కొత్తది కట్టడం శ్రేయస్కరం. ఒకవేళ కాయ మధ్యలోనే కుళ్లిపోతే, అది మీ ఇంటిపై పడాల్సిన పెద్ద విపత్తును లేదా నెగెటివ్ వైబ్రేషన్స్‌ను పీల్చుకుందని అర్థం. అప్పుడు వెంటనే దానిని తీసివేసి, ఎవరూ తొక్కని చోట పడేసి కొత్తది కట్టాలి.

# స్పోర్ట్స్ న్యూస్

# చేతికి వచ్చిన మ్యాచ్ చేజార్చుకున్న పంజాబ్..

## మిడిల్ ఓవర్లలోనే ఢిల్లీకి టర్నింగ్ పాయింట్!

ఆఅ లబ ఖఃఖా । పంజాబ్ కింగ్స్ పూర్తిగా తమ చేతుల్లో ఉన్న మ్యాచ్‌ను చేజార్చుకుని చేదు ఓటమిని మూటగట్టుకుంది. ధర్మశాలలో జరిగిన హైస్కోరింగ్ థ్రిల్లర్‌లో ఒక దశలో మ్యాచ్‌పై పూర్తి ఆధిపత్యం చెలాయించిన పంజాబ్, చివరకు మిడిల్ ఓవర్లలో బౌలర్ల వైఫల్యంతో ఓటమిని చవిచూసింది. మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్ అద్భుత కంబ్యాక్‌తో 211 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి సంచలన విజయాన్ని నమోదు చేసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 210/5 భారీ స్కోర్ నమోదు చేసింది. టాప్ ఆర్డర్ బ్యాటర్లు వేగంగా పరుగులు చేయడంతో పాటు చివరి ఓవర్లలో కూడా బలమైన ఫినిషింగ్ రావడంతో జట్టు భారీ స్కోర్‌ను అందుకుంది. ఆ తర్వాత బౌలింగ్‌లో కూడా పవర్ ప్లేలోనే ఢిల్లీ టాప్ ఆర్డర్‌ను కూల్చివేసి మ్యాచ్‌పై పట్టు సాధించింది.211 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీకి ప్రారంభంలోనే భారీ షాక్ తగిలింది. ఓపెనర్ అభిషేక్ పోరెల్ రెండో ఓవర్‌లో ఔట్ కాగా, కేఎల్ రాహుల్ మూడో ఓవర్‌లో పెవిలియన్ చేరాడు. సాహిల్ పరాఖ్ కూడా ఎక్కువసేపు నిలవకపోవడంతో ఐదు ఓవర్లకే ఢిల్లీ 33 పరుగులకు మూడు వికెట్లు కోల్పోయి తీవ్ర ఒత్తిడిలో పడింది. ఈ దశలో కెప్టెన్ అక్షర్ పటేల్ క్రీజులోకి వచ్చి మ్యాచ్‌ను పూర్తిగా మార్చేశాడు. మొదట ట్రిస్టన్ స్టబ్స్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టిన అక్షర్, ఆ తర్వాత డేవిడ్ మిల్లర్‌తో కలిసి పంజాబ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. ఇద్దరూ వేగంగా పరుగులు సాధిస్తూ మ్యాచ్‌ను ఢిల్లీ వైపు తిప్పేశారు.ఒక దశలో భారీ ఓటమి తప్పదనుకున్న ఢిల్లీకి అక్షర్-మిల్లర్ భాగస్వామ్యంతో మళ్లీ రేసులోకి వచ్చింది.



అక్షర్ ఔట్ అయిన తర్వాత కూడా మిల్లర్ దూకుడు తగ్గలేదు. వరుస బౌండరీలు, సిక్సర్లతో మ్యాచ్‌ను పూర్తిగా ఢిల్లీ ఆధీనంలోకి తీసుకొచ్చాడు. చివర్లో అశుతోష్ శర్మ ఫినిషింగ్ టచ్ ఇవ్వడంతో ఢిల్లీ విజయాన్ని ఖాయం చేసింది. అయితే ఈ మ్యాచ్‌లో అసలు టర్నింగ్ పాయింట్ మిడిల్ ఓవర్లే అయ్యాయి. 9వ ఓవర్‌లో వికెట్ తీసిన పంజాబ్ బౌలర్లు, 14వ ఓవర్ వరకు మరో వికెట్ పడగొట్టలేకపోయారు. ఈ ఐదు ఓవర్లలో ఢిల్లీ బ్యాటర్లు పూర్తిగా ఆధిపత్యం చెలాయించడంతో మ్యాచ్ పంజాబ్ చేతుల్లో నుంచి జారిపోయింది. బౌలింగ్‌లో అర్షదీప్ సింగ్ మాత్రమే కాస్త ప్రభావం చూపించాడు.నాలుగు ఓవర్లలో కేవలం 21 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. అయితే మిగతా బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు. యశ్ ఠాకూర్ నాలుగు ఓవర్లలో 55 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీసుకోగా, యాన్సెస్ 45 పరుగులు ఇచ్చాడు. బెన్ ద్వార్షుయిస్ కూడా నాలుగు ఓవర్లలో 51 పరుగులు సమర్పించుకోవడం పంజాబ్‌కు భారీ నష్టం కలిగించింది. ముఖ్యంగా కీలక సమయంలో బౌలర్లు లైన్ అండ్ లెంగ్త్ కోల్పోవడం, మిడిల్ ఓవర్లలో ఒత్తిడి సృష్టించలేకపోవడం పంజాబ్ ఓటమికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. వరుస విజయాలతో దూసుకెళ్లిన పంజాబ్‌కు ఇది మరో ఎదురుదెబ్బగా మారింది.

# ఐపీఎల్ నయా సంచలనం.. అసలెవరీ మాధవ్ తివారీ!



ఐపీఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు కొత్త యువ హీరో దొరికాడు. పంజాబ్ కింగ్స్‌పై జరిగిన కీలక మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఉత్కంఠ పోరులో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో డీసీ యువ ఆల్‌రౌండర్ మాధవ్ తివారీ అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. బంతితో రెండు కీలక వికెట్లు తీయడమే కాకుండా.. ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఈ సీజన్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లోనే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.ఈ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ప్రయాణం అంత గొప్పగా సాగలేదు. పంజాబ్ కింగ్స్‌పై మ్యాచ్‌లో తప్పక గెలవాల్సిన పరిస్థితి. ఇలాంటి దశలో జట్టులోకి యువ ఆల్‌రౌండర్‌ను తీసుకుని డీసీ షాకిచ్చింది. అతడికి ఇదే తొలి ఐపీఎల్ మ్యాచ్. అయితేనేమీ.. ఆ యువ పేస్ ఆల్‌రౌండర్ ఏ మాత్రం భయం లేకుండా ఉత్తమ ప్రదర్శన చేశాడు. అప్పటికే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుని దూకుడుగా ఆడుతున్న పంజాబ్ ఓపెనర్ ప్రియాంశ్ ఆర్యను మాధవ్ తివారీ పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత సూపర్ ఫామ్‌లో ఉన్న కూపర్ కనోలీ(38; 27 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు)ని ఔట్ చేసి.. పంజాబ్ పరుగుల జాతరకు బ్రేక్ వేశాడు.తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్.. 211 పరుగుల భారీ లక్ష్యాన్ని ఢిల్లీ ముందు ఉంచింది. ఛేదనలో వరుసగా 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన జట్టును.. కెప్టెన్ అక్షర్ పటేల్(56), డేవిడ్ మిల్లర్(51) హాఫ్ సెంచరీలతో గట్టెక్కించారు. కీలక దశలో వీరిద్దరూ ఔట్ అవ్వడంతో డీసీకి ఓటమి కాస్త దరి చేరినట్టు అనిపించింది. ఇలాంటి సమయంలో ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు మాధవ్ తివారీ. ఎదుర్కొన్న మొదటి బంతికే బౌండరీ బాదేశాడు. మొత్తంగా రెండు ఫోర్లు, ఒక సిక్స్‌తో 8 బంతుల్లో 18 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అటు బంతితోనూ, ఇటు బ్యాట్‌తోనూ రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ.. 'నేను 100 శాతం బ్యాటర్, 100 శాతం బౌలర్ అని చెప్పగలను' అంటూ తన మీద తాను పెట్టుకున్న నమ్మకాన్ని బలంగా చెప్పుకొచ్చాడు.మధ్యప్రదేశ్‌లోని మౌగంజ్ గ్రామానికి చెందిన మాధవ్ తివారీ 2003 సెప్టెంబర్ 28న జన్మించాడు. ఇప్పటివరకు ఫస్ట్‌క్లాస్ లేదా లిస్ట్-ఏ క్రికెట్ ఆడకపోయినా.. ఏజ్ గ్రూప్ టోర్నీలు, దేశవాళీ టీ20ల్లో రాణించి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ అతడిని రూ.40 లక్షలకు కొనుగోలు చేసింది. అదే సీజన్‌లో ముంబై ఇండియన్స్‌పై వాంఖడేలో ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. మాధవ్ మధ్యప్రదేశ్ అండర్-19, అండర్-23 జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. 2024-25 సీకే నాయుడు ట్రోఫీలో కూడా ఆకట్టుకున్నాడు. ముఖ్యంగా ముంబైపై ఫాలో ఆన్ పరిస్థితుల్లో 83 పరుగులు చేసి అందరి ప్రశంసలు అందుకున్నాడు. మధ్యప్రదేశ్ టీ20 లీగ్‌లో భోపాల్ లిపార్డ్స్ తరఫున ఆడి బ్యాట్, బాల్‌తో రాణించాడు. సెమీఫైనల్లో 31 బంతుల్లో 65 పరుగులు చేసి జట్టు ఫైనల్‌కు చేరుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. ఆ ప్రదర్శన చూసిన తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ అతడిని కొనుగోలు చేసింది.

# నేను స్వయంగా రిటైర్ అవ్వాలనేదే వారి కోరిక: వినేశ్ ఫొగాట్

భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గొండాలో జరుగుతున్న జాతీయ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నీలో పాల్గొనకుండా భారత రెజ్లింగ్ సమాఖ్య(డబ్ల్యూఎఫ్ఐ) ఆమెపై అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. అయినా సరే.. పోటీలో పాల్గొనేందుకు వినేశ్ గొండాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్ సింగ్‌తో సమావేశమయ్యారు. అనంతరం వినేశ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు.




ఆసియా క్రీడల్లో పాల్గొనకుండా ఉండాలనేదే డబ్ల్యూఎఫ్ఐ లక్ష్యమని ఆమె ఆరోపించారు. తాను మళ్లీ పతకాలు గెలుస్తానని వారు భయపడుతున్నారని విమర్శించారు.'2024 పారిస్ ఒలింపిక్స్‌లో అనర్హతకు గురైన తర్వాత నా జీవితంలోనే ఆనందాన్ని కోల్పోయాను. కానీ నా కుమారుడు క్రిధవ్ తిరిగి నాలో ఉత్సాహాన్ని తీసుకొచ్చాడు. వ్యవస్థపై పోరాడే శక్తి నా కొడుకు వల్లే వచ్చింది. నాపై అనర్హత వేటు వేసినట్టు శుక్రవారం రాత్రి నోటీసు అందింది. దానికి సమాధానం ఇచ్చేందుకు 14 రోజుల గడువు ఇచ్చారు. ఇదే విషయాన్ని డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్ సింగ్‌కు తెలిపాను. సమయం లేకపోవడం వల్ల ఆ నోటీసులకు క్లుప్తంగానే సమాధానం ఇచ్చాను. తొలుత నన్ను పోటీ చేయడానికి అనుమతి ఇవ్వమని సంజయ్ సింగ్‌ను కోరాను. 14 రోజుల తర్వాత నా సమాధానంతో సంతృప్తి చెందకపోతే చర్యలు తీసుకోమని చెప్పాను. కానీ సంజయ్ సింగ్ దానికి అంగీకరించలేదు. నేను మళ్లీ పతకాలు గెలుస్తానని డబ్ల్యూఎఫ్ఐ భయపడుతోంది.

# కలల కప్ కోసం పకడ్బందీగా.. ఆల్‌రౌండర్లతో సఫారీ స్క్వాడ్..!



మహిళల టీ20 ప్రపంచకప్ సమీపిస్తుండడంతో దక్షిణాఫ్రికా బోర్డు స్క్వాడ్‌ను ప్రకటించింది. గత సీజన్‌లో రన్నరప్‌తోనే సరిపెట్టుకున్నా.. ఈసారి టైటిల్ లక్ష్యంగా మంగళవారం లారా వొల్వార్డ్ కెప్టెన్‌గా పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేసింది. పొట్టి ఫార్మాట్‌లో రాణిస్తున్న15 మందికి చోటు దక్కగా.. వీరిలో సీనియర్ పేసర్ షబ్నిం ఇస్మాయిల్ కూడా ఉంది. వరల్డ్‌కప్ కోసం వీడ్కోలు వెనక్కి తీసుకున్న ఆమె మెగా ఈవెంట్‌లో సఫారీ పేస్ దళాన్ని నడిపించనుంది.అందని ద్రాక్షలా ఊరిస్తున్న ఐసీసీ ట్రోఫీని పట్టేసేందుకు దక్షిణాఫ్రికా సిద్ధమవుతోంది. నిరుడు భారత గడ్డపై వన్డే ప్రపంచకప్‌లో అదిరే ఆటతో ఫైనల్ చేరినా.. అనూహ్యంగా తడబడిన సఫారీ సైన్యం.. ఈసారి టైటిల్ లక్ష్యంగా స్క్వాడ్‌ను ఎంపిక చేసింది. అనుభవజ్ఞురాలైన లారా వొల్వార్డ్ కెప్టెన్సీలో పొట్టి ప్రపంచకప్‌ను తన్నుకుపోవడానికి వస్తోంది. వన్డే ప్రపంచకప్ ఆడిన చాలామందికి పొట్టి కప్ ఆడబోతున్నారు. కానీ, గత సీజన్‌లో సఫారీ టీమ్ ఫైనల్ చేరడంలో కీలకమైన అనెకే బాష్ మాత్రం ఈ ఎడిషన్‌కు ఎంపికవ్వలేదు.టాపార్డర్ బ్యాటర్లుగా తంజిమ్ బ్రిట్స్, డెర్క్‌సెన్, సునే లుస్ ఎంపికవ్వగా.. ఆల్‌రౌండర్లుగా మరినే కాప్, డీక్లెర్క్, చోలే ట్రయాన్‌లు చోటు సంపాదించారు. అండర్-19 కెప్టెన్ కైలా రెయ్‌న్కే తొలిసారి జాతీయ జట్టుకు ఆడనుండగా.. మూడేళ్ల క్రితం చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన షబ్నం ఇస్మాయిల్ యూటర్న్ తీసుకోవడంతో స్క్వాడ్‌లోకి వచ్చింది. ఇంగ్లండ్ వేదికగా జరిగే పొట్టి సంగ్రామంలో తను మరినే కాప్, డానే వాన్ నీకెర్క్, ఖాకతో కలిసి కొత్త బంతిని పంచుకోనుంది.దక్షిణాఫ్రికా ప్రపంచకప్ స్క్వాడ్ : లారా వొల్వార్డ్(కెప్టెన్), తంజిమ్ బ్రిట్స్, నడినే డీక్లెర్క్, అనెరీ డెర్క్‌సెన్, సినాలో జఫ్తా(వికెట్ కీపర్), మరినే కాప్, సునే లుస్, కరాబొ మెసో(వికెట్ కీపర్), నొనుకులులెకో మలబా, కైలా రెయ్‌నకే, తుమి సెఖునే, చొలే ట్రయాన్, డాన్ వాన్ నీకెర్క్, షబ్నిం ఇస్మాయిల్, అయబొంగ ఖాకా.

# కోహ్లీపై తప్పుడు ఆరోపణలు చేయమని డబ్బు ఆఫర్ చేశారు: లిజ్‌లాజ్




టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి సంబంధించిన సోషల్ మీడియా వివాదం మరోసారి చర్చనీయాంశమైంది. జర్మన్ మోడల్, సింగర్ లిజ్‌లాజ్ ఇన్‌స్టా ఫొటోకు కోహ్లీ లైక్ కొట్టిన అంశం వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ విషయంపై లిజ్‌లాజ్ తాజాగా సంచలన వ్యాఖ్యలు చేసింది. కోహ్లీపై తప్పుడు ఆరోపణలు చేయాలని కొందరు జర్నలిస్టులు తనను సంప్రదించారని.. అందుకు డబ్బు కూడా ఆఫర్ చేశారని ఆమె వెల్లడించింది'కోహ్లీ నా ఫొటోకు లైక్ కొట్టడంతో అనూహ్యంగా నేను సోషల్ మీడియాలో వైరల్ అయ్యాను. ఆ ఘటన తర్వాత పలువురు జర్నలిస్టులు నా దగ్గరికి వచ్చారు. కోహ్లీ గురించి చెడుగా మాట్లాడాలని, అతడు చేయని పనులపై కూడా ఆరోపణలు చేయాలని కోరారు. నాకు డైరెక్ట్‌గా మెసేజ్‌లు చేస్తున్నట్లు చెప్పమన్నారు. దానికి నాకు భారీగా డబ్బు కూడా ఆఫర్ చేశారు. కానీ నేను అలా ఎందుకు చేస్తాను? విరాట్ అంటే నాకు పిచ్చి అభిమానం. డబ్బు లేదా పాపులారిటీ కోసం అతడి ప్రతిష్ఠను దెబ్బతీసే ఉద్దేశం నాకు లేదు' అని లిజ్‌లాజ్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది. 'అందుకే కోహ్లీ దేశాన్ని వదిలి వెళ్లాడు' అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.జర్మనీకి చెందిన లిజ్‌లాజ్‌కు.. జర్మన్‌తో పాటు డచ్, ఫ్రెంచ్, రష్యన్, స్పానిష్ భాషలపై కూడా పట్టు ఉంది. సైకాలజీలో ఎంఎస్సీ పూర్తి చేసిన ఆమె.. సర్టిఫైడ్ లైఫ్ సేవింగ్ స్విమ్మర్ కూడా. ఫుడ్ వ్లాగింగ్, ట్రావెలింగ్, సాంగ్ రైటింగ్ ఆమె హాబీలు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు, విరాట్ కోహ్లీకి తాను అభిమానిని అంటూ గతంలో లిజ్‌లాజ్ చెప్పిన సంగతి తెలిసిందే.

# ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్‌కు భారీ జరిమానా

ఐపీఎల్ 2026లో భాగంగా సోమవారం పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఉత్కంఠ పోరులో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ విజయంతో డీసీ ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంచుకుంది. జట్టు గెలిచినప్పటికీ కెప్టెన్ అక్షర్ పటేల్‌కు మాత్రం బీసీసీఐ షాక్ ఇచ్చింది. ధర్మశాలలో జరిగిన మ్యాచ్‌ను నిర్ణీత సమయంలో పూర్తి చేయకపోవడంతో స్లో ఓవర్‌రేట్ కారణంగా బీసీసీఐ అక్షర్‌కు రూ.12 లక్షల జరిమానా విధించింది. ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లోని ఆర్టికల్ 2.22 ప్రకారం ఈ సీజన్‌లో ఢిల్లీకి ఇది తొలి తప్పిదం కావడంతో జరిమానాతో సరిపెట్టింది.ఐపీఎల్ 2026లో స్లో ఓవర్ రేట్ సమస్య పలువురు కెప్టెన్లకు తలనొప్పిగా మారింది. ఇప్పటికే శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్ గిల్, హార్దిక్ పాండ్యలపై కూడా బీసీసీఐ చర్యలు తీసుకుంది. గతంలో ఒకే జట్టు పదేపదే స్లో ఓవర్ రేట్‌కు పాల్పడితే కెప్టెన్లపై సస్పెన్షన్ విధించే నిబంధన ఉండేది. అయితే 2025 నుంచి ఆ నియమాన్ని బీసీసీఐ రద్దు చేసింది. ఇదిలా ఉంటే, పంజాబ్ కింగ్స్‌పై ఢిల్లీ క్యాపిటల్స్ సంచలన విజయం సాధించింది. 211 పరుగుల భారీ లక్ష్యాన్ని 19 ఓవర్లలోనే ఛేదించింది.






# ఈ కొత్త ట్విస్టును ఫ్యాన్స్ అస్సలు ఊహించలేదే!



ప్రపంచవ్యాప్తంగా సెన్సేషన్ సృష్టించిన స్పెయిన్ డ్రామా 'మనీ హీస్ట్' అభిమానులకు నెట్‌ఫ్లిక్స్ అదిరిపోయే సర్‌ప్రైజ్ ఇచ్చింది. 2019లో మొదలై 2022లో ఐదు సీజన్లతో ముగిసిన ఈ హీస్ట్ థ్రిల్లర్ ప్రయాణం ఇంకా ముగిసిపోలేదని నెట్‌ఫ్లిక్స్ హింట్ ఇచ్చింది. తాజాగా ఆదివారం నాడు విడుదల చేసిన ఒక స్పెషల్ అనౌన్స్‌మెంట్ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఈ వీడియోను చూసిన నెటిజన్లు అసలు 'మనీ హీస్ట్ సీజన్ 6' రాబోతుందా? లేక కొత్త స్పిన్-ఆఫ్‌లు రానున్నాయా? అని ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. సెల్వరాఘవన్ ప్రత్యేకత నెట్‌ఫ్లిక్స్ తన అధికారిక ప్రకటనలో 'రెవల్యూషన్ నెవర్ ఎండ్స్' (విప్లవం ఎప్పటికీ ముగియదు) అంటూ ఈ యూనివర్స్‌ను మరింత విస్తరిస్తున్నట్లు హింట్ ఇస్తూ టీజ్ చేసింది. స్పెయిన్ బ్యాంక్ నుండి టన్నుల కొద్దీ బంగారాన్ని కొల్లగొట్టిన ఆ అద్భుతమైన దోపిడీ ప్రయాణం కొత్త పుంతలు తొక్కబోతోందని తాజా టీజర్ ధృవీకరించింది. 'మనీ హీస్ట్' ప్రపంచం నిరంతరం పెరుగుతూ.. పరిణామం చెందుతూ మనల్ని ఆశ్చర్యపరుస్తూనే ఉంటుందని నెట్‌ఫ్లిక్స్ వివరించింది. అయితే ఇది నేరుగా ఆరవ సీజన్ అవుతుందా లేదా అనేది ఇంకా సస్పెన్స్‌గానే ఉంచింది. ప్రస్తుతానికి అందరి దృష్టి ప్రొఫెసర్ సోదరుడు బెర్లిన్ పాత్రపై రూపొందిన 'బెర్లిన్' సిరీస్‌పై ఉంది. ఈ స్పిన్-ఆఫ్ సిరీస్ రెండో సీజన్ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. పెడ్రో అలోన్సో ప్రధాన పాత్రలో నటిస్తున్న 'బెర్లిన్ సీజన్ 2' ప్రపంచవ్యాప్తంగా '2026 మే 15న విడుదల కావడానికి సిద్ధంగా ఉంది. ఈ సిరీస్ విడుదలైన తర్వాతే మనీ హీస్ట్ మెయిన్ స్టోరీకి సంబంధించిన మరిన్ని వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉందని సమాచారం. బెర్లిన్ రెండో సీజన్‌లో పాత పాత్రలతో పాటు పలువురు కొత్త నటులు కూడా సందడి చేయనున్నారు. మిచెల్ జెన్నర్, ట్రిస్టన్ ఉల్లోవా వంటి నటులు తమ పాత్రలను పునరావృతం చేస్తున్నారు. మొదటి హీస్ట్ నుండి శతాబ్దపు అత్యంత కళాత్మక దోపిడీ వరకు ఈ ప్రయాణం సాగిందని... భవిష్యత్తులో తెరకెక్కే కథలు కూడా అదే స్థాయిలో ఉత్కంఠను కలిగిస్తాయని టీజర్ ద్వారా అర్థమవుతోంది. దోపిడీల వెనుక ఉన్న ఆ తెలివితేటలు, ఎమోషన్స్ మళ్ళీ తెరపైకి రానున్నాయని ఈ టీజింగ్ వీడియో స్పష్టం చేస్తోంది. మొత్తానికి నెట్‌ఫ్లిక్స్ చేసిన ఈ ప్రకటనతో 'మనీ హీస్ట్' ఫ్యాన్ బేస్ మళ్ళీ యాక్టివ్ అయింది. సీజన్ 6 వచ్చినా లేదా కొత్త క్యారెక్టర్ల మీద మరిన్ని స్పిన్-ఆఫ్‌లు వచ్చినా చూసేందుకు ప్రేక్షకులు సిద్ధంగా ఉన్నారు. బెర్లిన్ రిలీజ్ డేట్ దగ్గరపడుతున్న తరుణంలో ఈ యూనివర్స్ నుండి రానున్న తదుపరి అప్‌డేట్ కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. హీస్ట్ ఇంకా ముగియలేదు.. అసలైన ఆట ఇప్పుడే మొదలైందని నెట్‌ఫ్లిక్స్ ఇచ్చిన హింట్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్.



# సూర్య సినిమాకు అసలు పరీక్ష ఇదే!

2026 ఇండిపెండెన్స్ డే వీకెండ్‌కు ఇండియన్ బాక్సాఫీస్‌లో ఇప్పటినుంచే హీట్ పెరుగుతోంది. తమిళ్, తెలుగు, హిందీ ఇండస్ట్రీలకు చెందిన భారీ సినిమాలు ఒకే సీజన్‌ను టార్గెట్ చేయడంతో రిలీజ్ డేట్ రాజకీయాలు మళ్లీ చర్చకు వస్తున్నాయి. ముఖ్యంగా సూర్య హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న విశ్వనాథ్ అండ్ సన్స్ రిలీజ్‌పై వస్తున్న వాయిదా వార్తలు ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. మొదట ఈ సినిమాను జూలైలో రిలీజ్ చేయాలని భావించిన మేకర్స్, ప్రస్తుతం ఆగస్టు వైపు చూస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. అయితే అదే సమయంలో రజనీకాంత్ జైలర్2, సన్నీ డియోల్ లాహోర్1947, నాని ది ప్యారడైజ్ లాంటి భారీ సినిమాలు కూడా రాబోతుండటంతో పరిస్థితి మరింత ఆసక్తికరంగా మారింది. అయితే ప్రస్తుతం ఇండస్ట్రీలో వినిపిస్తున్న మెయిన్ డిస్కషన్స్ ఏంటంటే, పెద్ద స్టార్ హీరోలు, భారీ బ్యానర్లు నిజంగానే థియేటర్ స్లాట్స్‌ను కంట్రోల్ చేస్తున్నాయా అన్నది. రజనీకాంత్ సినిమా వస్తుందనే టాక్ బయటకు రావడంతోనే ఇతర నిర్మాతలు తమ రిలీజ్ డేట్స్‌పై మళ్లీ లెక్కలు వేసుకుంటున్నారనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తోంది. ముఖ్యంగా జైలర్ మొదటి భాగం ఇండిపెండెన్స్ డే సీజన్‌లో రిలీజై భారీ విజయాన్ని అందుకోవడం ఇప్పుడు జైలర్2కు అదనపు బలంగా మారింది. అలాంటి సమయంలో సూర్య నటించిన విశ్వనాథ్ అండ్ సన్స్ లాంటి సాఫ్ట్ ఎమోషనల్ డ్రామా అదే క్లాష్‌లో నిలబడగలదా అనే సందేహాలు సహజంగానే వ్యక్తమవుతున్నాయి. నిబి అయితే మరోవైపు కంటెంట్ బలంగా ఉంటే క్లాష్ భయం అవసరమా? అనే ప్రశ్న కూడా వినిపిస్తోంది. గతంలో చిన్న సినిమాలు కూడా భారీ క్లాష్‌ల మధ్య నిలబడి బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించిన సందర్భాలు ఉన్నాయి. అందుకే కొందరు విశ్లేషకులు విశ్వనాథ్ అండ్ సన్స్ కు మంచి ఎమోషనల్ కనెక్ట్ ఉంటే రిలీజ్ టైమింగ్ కంటే కంటెంట్ ముఖ్యమవుతుందని భావిస్తున్నారు. ముఖ్యంగా డైరెక్టర్ వెంకీ అట్లూరిపై ఇండస్ట్రీలో మంచి నమ్మకం ఉంది. ఈ సినిమాతో సూర్యకు మంచి హిట్ ను ఇస్తారని అందరూ బలంగా నమ్ముతున్నారు. అయితే మరోవైపు మాత్రం ఎంత కంటెంట్ స్ట్రాంగ్ గా ఉన్నప్పటికీ, ఎంత హిట్ టాక్ వచ్చినప్పటికీ, పోటీలో వస్తే కలెక్షన్లు షేరవడం ఖాయం. అలా కాకుండా సోలో రిలీజ్ చూసుకుంటే బిజినెస్ పరంగా సినిమాకు ఉపయోగముంటుందని అభిప్రాయపడుతున్నారు. ఇక సూర్యకు మాత్రం ఈ ఇయర్ చాలా కీలకంగా మారింది. సూర్య నటించిన వీరభద్రుడు, విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమాలు తక్కువ గ్యాప్‌లో రిలీజ్ కాబోతుండటంతో ఈ రెండు రిజల్ట్స్ ఆయన పాన్ ఇండియా మార్కెట్ ఫ్యూచర్ ను డిసైడ్ చేసే అవకాశముంది. గత కొంతకాలంగా సరైన కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూస్తున్న సూర్య, ఈసారి స్ట్రాంగ్ కంబ్యాక్‌పై ఫోకస్ పెట్టినట్టు కనిపిస్తోంది. ఇదిలా ఉంటే పోస్ట్‌పోన్ కల్చర్‌పై కూడా ఇండస్ట్రీలో విమర్శలు పెరుగుతున్నాయి. ఒకసారి అనౌన్స్ చేసిన రిలీజ్ డేట్స్‌కు కట్టుబడి ఉండకపోవడం వల్ల ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. థియేటర్ల ప్లానింగ్ నుంచి అడ్వాన్స్ బుకింగ్స్ వరకు ప్రతిదీ రిలీజ్ క్యాలెండర్‌పై ఆధారపడుతుండటంతో లాస్ట్ మినిట్ ఛేంజెస్ మొత్తం చైన్‌పై ప్రభావం చూపుతున్నాయి. మరి వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని విశ్వనాథ్ అండ్ సన్స్ రిలీజ్ డేట్ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.



# భోగి నుంచి మందారం.. ఏదో మ్యాజిక్ ఉందిగా..

శర్వానంద్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో రూపొందుతున్న భారీ యాక్షన్ డ్రామా 'భోగి' పోస్టర్స్ తోనే క్యూరియసిటీని క్రియేట్ చేస్తోంది. శర్వానంద్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన లుక్ ఇప్పటికే సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేసింది. పక్కా రా అండ్ రస్టిక్ విజువల్స్ తో ఈ సినిమా పీరియాడిక్ యాక్షన్ జోనర్ లో కొత్త బెంచ్ మార్క్ సెట్ చేసేలా కనిపిస్తోంది. లేటెస్ట్ గా ఈ ప్రాజెక్ట్ నుంచి మరో ఇంట్రెస్టింగ్ అప్ డేట్ వచ్చింది.సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న డింపుల్ హయతి కి సంబంధించిన 'మందారం' లుక్ ని మేకర్స్ విడుదల చేశారు. అసలు విషయం ఏంటంటే, ఈ పోస్టర్ లో డింపుల్ హయతి మునుపెన్నడూ చూడని విధంగా కనిపిస్తున్నారు. ఎర్రటి చీర కట్టుకుని, పాత కాలపు నగలు ధరించి, చేతిలో తాటాకు విసనకర్రతో కూర్చున్న ఆమె అవతార్ 1960ల నాటి వాతావరణాన్ని పక్కాగా హైలెట్ చేస్తోంది. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, ఇందులో నటనకు ఆస్కారం ఉన్న 'మందారం' అనే పవర్ ఫుల్ రోల్ ఆమె చేస్తున్నట్లు పోస్టర్ చూస్తే అర్థమవుతోంది. "ప్రపంచం కోరుకున్న అందం.. కానీ ఎవరూ అర్థం చేసుకోలేని మనసు" అంటూ ఈ పాత్రకు ఇచ్చిన డిస్క్రిప్షన్ క్యూరియాసిటీని పెంచుతోంది. దర్శకుడు సంపత్ నంది ఈ సినిమా కోసం ప్రతి పాత్రను చాలా ఇంటెన్సివ్ గా డిజైన్ చేశారు. మందారం పాత్రకు సంబంధించి ఆయన సోషల్ మీడియాలో పెట్టిన డైలాగ్ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. "నా బో×××లో ప్రపంచం చల్ తీ.. మందారం ఈడ.." అంటూ చాలా రా గా ఉన్న ఒక లైన్ ని ఆయన షేర్ చేశారు. దీన్ని బట్టి సినిమాలో మాటలు ఎంత పవర్ ఫుల్ గా, ఎంత లోకల్ నెటివిటీతో ఉండబోతున్నాయో ఊహించవచ్చు. డింపుల్ హయతి లుక్ లోని కళ్లలో ఉన్న ధైర్యం చూస్తుంటే శర్వానంద్ తో పోటీ పడే రేంజ్ లో ఆమె క్యారెక్టర్ ఉండబోతోందని తెలుస్తోంది.శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్ పై కె.కె. రాధామోహన్ అత్యంత భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే 20 ఎకరాల్లో వేసిన భారీ సెట్ లో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. భీమ్స్ సిసిరోలియో ఈ యాక్షన్ డ్రామాకు సంగీతం అందిస్తున్నారు. ఆగస్టు 28న సినిమాను విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే స్పష్టం చేశారు. కేవలం ఫైట్లు, పొలిటికల్ డ్రామా మాత్రమే కాకుండా, బలమైన ఎమోషన్స్ చుట్టూ ఈ కథ తిరుగుతుందని చిత్ర యూనిట్ చెబుతోంది. 'భోగి' సినిమా నుంచి వస్తున్న ఒక్కో అప్ డేట్ సినిమా రేంజ్ ను పెంచుకుంటూ వెళ్తున్నాయి.




# ఎల్లమ్మ కోసం ఫ్రెష్ ఫేస్ కావాల్సిందేనా?

బలగం సినిమాతో ప్రేక్షకుల మనసును గెలుచుకున్న దర్శకుడు వేణు యెల్దండి ఇప్పుడు తన రెండో సినిమా ఎల్లమ్మపై పూర్తి దృష్టి పెట్టారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఆ మూవీని స్ట్రాంగ్ ఎమోషన్స్, ఫోక్ కల్చర్, డివోషనల్ ఎలిమెంట్స్ తో తీయనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా హీరోయిన్ సెలక్షన్ పై గత కొంతకాలంగా పెద్ద చర్చ నడుస్తోంది. సినిమాలో హీరోయిన్ రోల్ కు యాక్టింగ్ కు ఫుల్ స్కోప్ ఉండటంతో వేణు చాలా జాగ్రత్తగా సెలెక్ట్ చేస్తున్నారని సమాచారం. మొదట ఆ పాత్ర కోసం సాయి పల్లవిని సంప్రదించినట్లు ప్రచారం జరిగింది. తెలంగాణ గ్రామీణ యువతి పాత్రకు ఆమె సరిపోతుందని యూనిట్ భావించినప్పటికీ, డేట్స్ సమస్యల కారణంగా ఆమె ఆ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నట్లు టాక్ వినిపించింది. ఆ తర్వాత కీర్తి సురేష్ పేరు గట్టిగా వినిపించింది. ఒక దశలో ఆమె సెలెక్షన్ దాదాపు ఖాయమైందన్న ప్రచారం కూడా జరిగింది. అంతేకాదు.. శృతి హాసన్, మృణాల్ ఠాకూర్, భాగ్యశ్రీ బోర్సే, రుక్మిణి వసంత్ వంటి పేర్లు కూడా పరిశీలనలోకి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటివరకు ఎవరినీ ఫైనల్ చేయలేదని తెలుస్తోంది. ప్రస్తుతం మాత్రం కొత్త హీరోయిన్ వైపు దర్శకుడు మొగ్గు చూపుతున్నారని సమాచారం. దేవి శ్రీ ప్రసాద్ కు జోడీగా ఫ్రెష్ ఫేస్ ఉంటే కథకు కొత్తదనం వస్తుందని యూనిట్ భావిస్తోందట. అందుకే కొత్త అమ్మాయి కోసం ప్రత్యేకంగా ఆడిషన్స్ కూడా నిర్వహిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. కచ్చితంగా ఎల్లమ్మ కోసం ఫ్రెష్ ఫేస్ కావాల్సిందేనని భావిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. అయితే చిత్రంలో మెయిన్ అట్రాక్షన్ సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ హీరోగా కనిపించడమే. ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలకు సంగీతం అందించిన డీఎస్పీ ఇప్పుడు పార్శి అనే పవర్‌ఫుల్ పాత్రతో నటుడిగా కొత్త జర్నీని స్టార్ట్ చేస్తున్నారు. ఇటీవల విడుదలైన గ్లింప్స్ లో ఆయన లుక్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. గ్రామీణ గెటప్ లో డీఎస్పీ కనిపించిన తీరు అభిమానులను ఆకట్టుకుంది. అంతేకాదు, సినిమాకు సంగీతం కూడా ఆయనే అందిస్తున్నారు. ఎల్లమ్మ కథ తెలంగాణ సంప్రదాయాలకు దగ్గరగా ఉండబోతున్నట్లు ఇప్పటికే వచ్చిన గ్లింప్స్ ద్వారా అర్థమైంది. వేప ఆకులు, పసుపు, కుంకుమ, గజ్జెల శబ్దాలు, జాతర వాతావరణం వంటి విజువల్స్ సినిమాపై ప్రత్యేక ఆసక్తి పెంచాయి. వేణు యెల్దండి మరోసారి బలగం తరహాలో మన సంస్కృతిని సిల్వర్ స్క్రీన్ పై చూపించబోతున్నారని ప్రేక్షకుల్లో అంచనాలు పెరుగుతున్నాయి. ఇక చిత్రాన్ని ప్రముఖ నిర్మాత దిల్ రాజు, శిరీష్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఆ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. తెలుగు తో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో కూడా విడుదలకు ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు చివరి దశకు చేరుకున్నాయని, హీరోయిన్ ఎంపిక పూర్తైన వెంటనే జూన్ లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేలా మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది. వేణు యెల్దండి దర్శకత్వం, డీఎస్పీ హీరోగా ఎంట్రీ, తెలంగాణ బ్యాక్ డ్రాప్ వంటి ఎలిమెంట్స్ తో ఎల్లమ్మపై ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది.




Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications**, D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications**, D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal, RNI No. APTEL/2012/46940**, e-mail: **sreechakratelugu@gmail.com.**